వార్త

ఆదివారం

14 మే, 2023



# కుటుంబ జీవనం ప్రగతికి సోపానం



# వరుస సినిమాలతో శ్రీలీల బిజీ



'పెళ్లిసందడి' చిత్రంతో రోషన్ సరసన శ్రీలీల టాలీవుడ్ అరంగేట్రం చేసింది. ఇందులో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. రవితేజ 'ధమాకా' చిత్రంతో విజయం అందుకుంది. ఆ తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్', డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సూపర్ స్టార్ మహేశ్‌బాబు చేయబోయే చిత్రం, నందమూరి బాలకృష్ణ 108వ చిత్రంలోనూ నటిస్తోంది. బోయపాటి-రామ్ పోతినేని రాబోయే చిత్రం, పంజా వైష్ణవ్‌తేజ నాల్గవ చిత్రం, నితిన్ రాబోయే చిత్రంలోనూ శ్రీలీల కీలక పాత్రలో నటిస్తుంది.

విజయ్ దేవరకొండతో ఆమె కొత్త ప్రాజెక్ట్ పూజా కార్యక్రమం జరిగింది. టాలీవుడ్‌లో భారీ ప్రాజెక్టుల్లోనూ భాగమైన ఈ యువ నటి ఇంకెన్ని అవకాశాలు దక్కించుకుంటుందో చూడాలి మరి.

తారాతీరం

# శివప్రసాద్ దర్శకత్వంలో 'విమానం'



తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న వైవిధ్యమైన చిత్రం 'విమానం'. శివప్రసాద్ యానాల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు సముద్రఖని ఇందులో మధ్య వయసు తండ్రి పాత్రలో నటించారు. భార్య లేకపోయినా, అంగవైకల్యంతో బాధపడుతున్నప్పటికీ కొడుకుని ప్రేమగా పెంచుకుంటాడు.

జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్స్‌పై ఈ సినిమా రూపొందుతోంది. జూన్ 9న ఈ చిత్రం విడుదల కానుంది.

ఇందులో సముద్రఖని, మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్, రాజేంద్రన్ మొదలైనవారు నటించారు.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

14 మే, 2023

## మంచి ముత్యాలు

పుస్తకాలు దీపాల వంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది.

- అంబేద్కర్

## విషయ విశేషం


వెరైటీ సబ్బులు... 4

'సంఘీ'భావం....5

అన్నదాత బతుకు ఎప్పుడూ ఆగమేనా..?

కవర్ స్టోరీ..6

కుటుంబ జీవనం ప్రగతికి సోపానం

విప్లవ తపస్వి 'అల్లూరి' స్మృత్యంజలి..10

ఈవారం కవిత్వం..14

ఊహల పల్లకి

కథ.. 20

ఓ అమ్మ విజయం

పిల్లల్లో మానసిక అలసట....24

రంగుల రాజధాని కల్మాండు లోయ ...25

మంచి చేస్తే ఆ ఫలాన్ని చూస్తాం....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

నవ్వుల్ రువ్వుల్

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## అర్థాలు చెప్పే బుక్‌మార్క్



ఓ పుస్తకం చదివి మధ్యలో ఆపేస్తున్నప్పుడు ఏ పేజీ చదువుతున్నామో గుర్తుపెట్టుకునేందుకు అందులో బుక్‌మార్క్‌ను ఉంచడం పుస్తక ప్రియులకు అలవాటే. అలాగే పుస్తకం చదువుతున్న సమయంలో ఏదైనా ఓ పదానికి అర్థం తెలియకపోతే గబగబా డిక్షనరీలోనో లేదా పక్కనే ఉండే ఫోనులోనో వెతికి తెలుసు కోవడమూ మామూలే. ఈ రెండింటి పనినీ ఇప్పుడొస్తున్న 'డిజిటల్ బుక్‌మార్క్' చేస్తాయి తెలుసా! ఎలాగంటే ఓ పుస్తకాన్ని చదివి మధ్యలో ఆపేముందు పేజీల మధ్యలో ఈ డిజిటల్ బుక్‌మార్క్‌ను పెట్టుకోవచ్చు. అంతేనా..మనం ఓ అరగంటసేపు పుస్తకం చదవాలనుకున్నప్పుడు ఇందులో అలారం కూడా సెట్‌చేసుకోవచ్చు. అన్నింటికీ మించి కొత్తపదం కనిపించినప్పుడు వెంటనే డిక్షనరీ కోసం వెళ్లే అవసరం లేకుండా ఇందులోనే ఆ పదాన్ని టైప్‌చేసి అర్థాన్ని తెలుసుకోవచ్చు. అలాగే ఎంత సమయం చదివామనేదీ ఇందులో నమోదు అవుతుంది. పిల్లల్నీ ఆకట్టుకునే విధంగా రకరకాల డిజైన్లూ, రంగుల్లో వస్తున్నాయీ డిజిటల్ బుక్‌మార్క్‌లు.

### వాతావరణం వేడెక్కడం వల్లే!

ఈమధ్య ఎవరిని కదిపినా ఏదో ఒక బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు చెబుతున్నారు. దీనికి కారణం వాతావరణం వేడెక్కడమే అంటున్నారు బ్రిటన్‌లోని ఈస్ట్‌ఆంగ్లియా యూనివర్సిటీ నిపుణులు. ముఖ్యంగా కోస్తా తీరాల్లో నీటి ఉష్ణోగ్రత పెరగడంతో విబ్రియో వర్నిఫైకస్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది అది త్వరగా వ్యాపిస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. ముఖ్యంగా గ్లోబల్‌వార్మింగ్ కారణంగా న్యూయార్క్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రానున్న ఇరవైఏళ్లలో ఈ రకమైన బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సంఖ్య ఎక్కువయ్యే ప్రమాదం లేకపోలేదని చెబుతున్నారు. ఇదిగానీ సోకితే ప్రతి ఐదుగురిలో ఒకరు మరణించే ప్రమాదం ఉందట. ఈ వ్యాక్టీరియా వేసవిలో ఎక్కువగా వ్యాపించడంతో పాటు, చర్మకణాలను దారుణంగా దెబ్బతినేలా చేస్తుంది. అందుకనే దీన్ని ఫ్లెష్ ఈటింగ్ వ్యాధి అంటున్నారు. ఒకవేళ బతికి బట్టకట్టినా కాళ్లూచేతులూ పనిచేయవట. దీనంతటికీ కారణం గ్రీన్‌హౌస్ వాయువులే. కాబట్టి ఇకనైనా జాగ్రత్తపడకపోతే ఈ శతాబ్దాంతానికి మరెన్నో ఇన్ఫెక్షన్లు పుట్టుకురావచ్చు అని హెచ్చరిస్తున్నారు.





# వెరైటీ సబ్బులు

రకరకాల సబ్బులు దొరుకుతున్న ఈ రోజుల్లో నచ్చినదాన్ని ఎంచుకోవడం చాలాతేలిక. అయితే ఆ సబ్బులు చర్మాన్ని శుభ్రపరచడంతో పాటూ అదనపు ప్రయోజనాలనూ తెచ్చిపెడితే ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

**ఇదిషాంపూ.. సోప్‌కాదు**



ఇప్పుడంటే రకరకాల షాంపూలు, కండిషనర్లూ వాడుతున్నాం కానీ.. ఒకప్పుడు తలకూ సబ్బునే వాడేవారు. తయారీదారులు ఆ పాత పద్ధతిని మళ్లీ వాడుకలోకి తేవాలను కున్నారో ఏమో ఇప్పుడు షాంపూ, కండిషనర్లను సబ్బుల రూపంలోనూ రూపొందిస్తున్నారు. ముఖానికి సబ్బు రద్దుకున్నట్లుగానే వీటినీ తలకు రాసుకోవచ్చు. పైగా ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఈ సబ్బుల్ని తీసుకెళ్లడమూ తేలిక. షాంపూల్లో బోలెడు రకాలు ఉన్నట్లుగానే ఈ షాంపూబార్లూ, కండిషనర్లు కూడా రంగురంగుల్లో, ఫ్లేవర్లలో, హెర్బల్ రకాల్లోనూ దొరుకుతున్నాయి.

**పీచుతో పనేముంది?**



ఒకప్పుడు చర్మంపైన పేరుకున్న మృతకణాలూ, మురికీ వదిలించేందుకు పీచును వాడేవారు. క్రమంగా లూఫా అందుబాటులోకి రావడంతో దాన్ని ఉపయోగించుకోవడం మొదలుపెట్టారు. ఇప్పుడావి మరింత సులువు చేస్తున్నాయి పీచు సబ్బులు. అంటే ఈ సబ్బులోనే పీచు కూడా ఉంటుంది కాబట్టి అదనంగా పీచు వాడాల్సిన పని ఉండదు. పైగా ఈ సబ్బులను ప్రధానంగా కలబంద, కాఫీ, నిమ్మ వంటి వాటితోనే తయారుచేయడం వల్ల చర్మం కూడా మృదువుగా ఆరోగ్యంగా ఉంటుంది.

**సున్నిపిండితో పనిలేదిక..**

పదిహేనురోజులకోసారి చక్కగా నలుగుపెట్టుకుని కాసేపయ్యాక స్నానం చేయాలు. చర్మం ఎంత మృదువుగా ఉంటుందో తెలుసా. మా కాలంలో అదే మాకు క్లెన్సర్, ఫేస్‌ప్యాక్ అన్నీ..అంటూ మన పెద్దలు చెబితే అంత టైమ్ ఎక్కదుంటుంది పైగా ఆ పిండిని రాసుకోవడం, అది పోయేదాకా శుభ్రం చేసుకోవడం పెద్ద పని అని కొట్టిపారేస్తుంటుంది ఈ తరం. అలాంటివాళ్లను దృష్టిలో పెట్టుకునే సున్నిపిండిని సబ్బురూపంలో తీసుకొచ్చేశారు తయారీదారులు. సున్నిపిండిని ఎక్కువ మోతాదులో ఉపయోగించి తయారుచేసిన ఈ సబ్బును వాడితే నలుగుపెట్టుకుని స్నానం చేసినట్లుగానే అనిపిస్తుంది. ముఖానికి అప్పుడప్పుడూ సెనగపిండి ప్యాక్ వేసుకోవడం కష్టం అనుకునేవారికి ఇప్పుడు సెనగపిండితో తయారు చేసిన సబ్బులు కూడా దొరుకుతున్నాయి. దీన్ని కూడా సున్నిపిండి సబ్బు తరహాలోనే వాడుకోవచ్చు. అదేవిధంగా ముల్తానీమట్టిని ప్యాక్‌లా వేసుకుని ఆరబెట్టుకుని ఆ తరువాత శుభ్రం చేసుకునే తీరికలేదనుకునే వారికి ముల్తానీమట్టి సోప్‌బార్‌లూ దొరుకుతున్నాయి.

**సబ్బులో స్క్రబ్**



మోచేతులూ, మోకాళ్లూ పొడిబారినప్పుడూ మృతకణాలు ఎక్కువగా ఉన్నప్పుడు కాస్త బరకగా ఉండే ప్యాక్‌ను వేసుకోవడం మామూలే. కానీ ఆ ప్యాక్ తయారుచేసుకునేందుకు కాఫీపొడి, చక్కెర వంటివన్నీ సిద్ధం చేసుకోవాలి. వాటికి ప్రత్యామ్నయంగా స్క్రబ్‌లు వచ్చినా ఇప్పుడు ఆ పనిని మరింత సులువు చేస్తున్నాయి స్క్రబ్‌సోప్‌లు. సాధారణ సబ్బులతో పోలిస్తే ఇవి కాస్త బరకగా ఉండటం వల్ల అచ్చంగా స్క్రబ్‌లానే పనిచేస్తాయి. కాఫీపొడి, పెసర-పెరుగు, నిమ్మతొక్కలపొడి వంటివాటితో తయారయ్యే ఈ సబ్బులతో సమస్య తీరడమే కాదు చర్మం కూడా తాజాగా ఉంటుంది.

**రైస్‌సోప్ వచ్చేసింది**

జపనీయులూ, కొరియన్లూ పాటించే సౌందర్య సంరక్షణలో బియ్యప్పిండి లేదా అన్నంతో తయారుచేసిన ప్యాక్, బియ్యం కడిగిన నీళ్ల వంటివి ఎక్కువగా ఉంటాయి. బియ్యం నుంచి అందే పోషకాలతో చర్మం, జుట్టూ మృదువుగా ఆరోగ్యంగా ఉంటాయనీ, వార్ధక్యపు ఛాయలూ త్వరగా రావనీ వాళ్ల నమ్మకం మరి. తయారీదారులు దాన్ని గురించే రైస్‌మిల్క్ సోప్‌ను అందుబాటులోకి తెచ్చారిప్పుడు. బ్రౌన్‌రైస్ లేదా ఆర్గానిక్ రైస్, బాదంనూనె, షియాబటర్, సోప్‌బేస్ వంటివి కలిపి తయారు చేసే ఈ సబ్బు చర్మాన్ని మృదువుగా మార్చడంతో పాటూ మృతకణాలనూ తొలగిస్తుంది. పైగా ఈ సబ్బును చర్మానికే కాదు జుట్టుకీ షాంపూ బదులుగా వాడుకోవచ్చుట. ❑

'సంఘీ' భావం



# అన్నదాత బతుకు ఎప్పుడూ ఆగమేనా..?

వ్యవసాయాధారిత దేశంగా ఉన్నప్పటికీ అన్నదాతకు ప్రతి సీజన్‌లోను తిప్పలు తప్పడం లేదు. దేశంలో అన్ని వ్యాపారాలకు, పరిశ్రమలకు, వస్తువులకు కనీస మద్దతు ప్రభుత్వం నుంచి లభిస్తున్నప్పటికీ అన్నదాతకు మాత్రం సరైన సహకారం ఉండటం లేదు. ఇప్పటి వరకు పంట చేతికి వచ్చినా దానికి సంబంధించిన డబ్బు అందేవరకు అన్నదాత ఆతృతగానే ఉంటున్నాడు. ఈ సీజన్‌లో అకాల వర్షాలు రైతుకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ప్రభుత్వం చేసే ప్రకటనలకు, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న హామీలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంట దిగుబడి అధికంగా వచ్చింది. సీజన్ మొత్తం సానుకూలంగా గడిచి పంట కూడా చేతికి వచ్చింది. ఇక వారం రోజుల్లో విక్రయాలు జరిగి డబ్బు చేతికి వస్తుందని ఆశగా ఉన్న రైతుకు అకాల వర్షాల రూపంలో వచ్చిన ఉపద్రవం కన్నీరు పెట్టించే విధంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఎకరానికి పది వేల రూపాయలు నష్టపరిహారం ఇస్తానని ప్రకటించింది. 20 శాతం తేమగా ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇది అమలులో ఏమేరకు సఫలీకృతం అవుతుందన్నది అనుమానస్పదమే. నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్నో నిబంధనలు ఉంటాయి. ఇది ఈ ఒక్కసీజన్ సమస్య కాదు. వరి ధాన్యం పండించేందుకు సుమారు 30 నుంచి 40 వేలు ఖర్చు ఉంటుంది. నారుమడి, పొలం దున్నడం, చదును చేయడం, గట్టు చెక్కడం, వరినాటు, విత్తనాల కొనుగోలు, డిఎపీ రెండు బస్తాలు, యూరియా రెండు బస్తాలు, పొటాష్ ఒక బస్తా, పిచకారి, వరికోత మిషన్, ట్రాక్టర్, హమాలీ ఖర్చులు ఇలా ఎన్నో రకాలుగా పెట్టుబడి పెట్టాలి. ఆ తరువాత సుమారు ఆరు నెలల పాటు శ్రమిస్తే, వాతావరణం అనుకూలించి, చీడపీడల బెడద లేకపోతే పంట చేతికి వస్తుంది. ఈ ఖర్చులన్నీ కలుపుకుంటే సుమారు 40 వేల రూపాయలు దాటుతుంది. సమస్యలు ఎదురై పంట నష్టపోతే ఇక ఆరుగాలం పండిన కష్టంతో పాటు పెట్టుబడి కూడా కోల్పోవలసి వస్తుంది. ప్రభుత్వం కరుణ చూపితే అక్కడి నుంచి వచ్చే మొత్తం పదివేల రూపాయలకు మించి ఉండటం లేదు. కనీసం నారుమడి, పొలం దున్నడానికి అయ్యే ఖర్చు కూడా తిరిగి రావడం లేదు. ఈ సీజన్‌లో నష్టపోయినా రాబోయే సీజన్‌లో తేరుకుందామన్న ఆశతో మళ్లీ పొలంబాట పట్టడం జరుగుతుంది. అయితే చాలామంది రైతులు వడ్డీలకు అప్పు చేసి పెట్టుబడి డబ్బులు తీసుకువస్తుంటారు. ఈ సీజన్ సమస్యలతో సంబంధం లేకుండా వడ్డీవ్యాపారులు వ్యవహరిస్తుంటారు. సకాలంలో డబ్బు తిరిగి చెల్లించకపోతే వడ్డీ, అసలు కలిపి కొత్త బాకీ తయారుచేస్తారు. ఇక మరో సీజన్‌కు డబ్బు ఇవ్వాలంటే ఎన్నో షరతులు ఉంటాయి. వాటన్నింటినీ భరించి రెండవ సీజన్‌లో రైతులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. బీమా సౌకర్యం ఉన్నా రైతులకు పూర్తిస్థాయిలో సహాయం అందిన దాఖలాలు లేవు. పంట రుణాలు తీసుకునే సమయంలో బ్యాంకులు బీమాకు సంబంధించి మొత్తాలను మినహాయించుకుని చెల్లింపులు చేస్తుంటారు. అయితే నష్టం జరిగినప్పుడు మాత్రం బీమా క్లయిమ్‌తో సంబంధం లేకుండా ఇచ్చిన రుణాలను తిరిగి రాబట్టేందుకు బ్యాంకులు పట్టుపడుతుంటాయి. కొందరు బ్యాంకు అధికారులు తమ లక్ష్యాలను పూర్తి చేసుకునేందుకు రైతులకు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లింపులు జరిగినట్లు రికార్డుల్లో చూపిస్తారు. రైతు రుణం తీసుకుని గడువులోగా చెల్లించే పరిస్థితి లేకపోతే రైతును బ్యాంకుకు రప్పించి పాత రుణం చెల్లించినట్లు, అప్పటికప్పుడు కొత్త రుణం ఇచ్చినట్లు రికార్డుల్లో చూపించి చేతులు దులుపుకుంటారు. ఈ సమయంలో ప్రభుత్వం రుణమాఫీ ప్రకటిస్తే ఆయా రైతులకు అన్యాయం జరుగుతుంది. ప్రతి సీజన్‌లో రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటూ ఉంటారు. ఒక్క వరి రైతే కాదు వ్యవసాయ రంగానికి చెందిన అన్ని ఉత్పత్తులకు సంబంధించిన రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మనదేశం వ్యవసాయాధారిత దేశంగా గుర్తింపు పొందినా రైతులకు మాత్రం చేకూరిన ప్రయోజనం లేదు. వ్యవసాయరంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కాని, రాష్ట్ర ప్రభుత్వాలు కాని ముందుకు రావడం లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో కంటి తుడుపు చర్యలు మినహా రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నం జరగడం లేదు. మన కంటే చిన్న దేశాల్లో, వ్యవసాయ విస్తీర్ణం తక్కువగా ఉన్న దేశాల్లో అక్కడి ప్రభుత్వాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. చైనా వంటి దేశాల్లో వ్యవసాయ రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉంది. కొన్ని దేశాల్లో వ్యవసాయ పెట్టుబడులు పెట్టడమే కాకుండా, పంటను కొనుగోలు చేసే బాధ్యతను కూడా ప్రభుత్వాలే భరిస్తున్నాయి. ఈ కారణంతో అక్కడి యువత ఉన్నత చదువులు చదివినా వ్యవసాయ రంగంపై ఆసక్తి చూపుతున్నారు. మన దేశంలో అందుకు భిన్నమైన వాతావరణం ఉంది. ఇక్కడ వ్యవసాయం నుంచి వేరే ఉపాధి మార్గాలను అన్వేసిస్తున్నారు. ప్రధానంగా రైతు కుటుంబాలకు చెందిన యువత వ్యవసాయానికి దూరంగా ఉండాలని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొవడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా ప్రభుత్వాలు రైతులను రాజకీయాలు, ఎన్నికల వ్యూహాలతో సంబంధం లేకుండా వ్యవసాయరంగాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# కుటుంబ జీవనం ప్రగతికి సోపానం

**కవర్ స్టోరీ**

**ఎం.వెంకటేశ్వరరావు**

**'జీవితంలో ఆనందం చాలాభాగం మనకున్న సత్సంబంధాల వలన లభ్యమవుతుందని, దిగుళ్లు, విచారాలన్నీ అప్రియమైన సంబంధాల వలన కలుగుతాయనీ' అంటాడు మానసిక శాస్త్రవేత సిడ్నీ జోరర్డ్. మనకొచ్చే సమస్యల్లో ఎక్కువ భాగం మానవ సంబంధాలకు సంబంధించినవే.**

మానవ సంబంధాలను ఉన్నతంగా మలచుకున్నవారు వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక, ఆధ్యాత్మిక జీవితాల్లో సాఫల్యం సాధిస్తారు. సాటి వారితో సత్సంబంధాలు ఏర్పరచుకోలేక పోవటమే మనిషి జయాపజయాలకు, నైరాశ్యానికి ముఖ్యకారణం. కొన్నేళ్లక్రితం వచ్చిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే సినిమా క్లైమాక్సులో తండ్రి కొడుకులను పక్కన కూర్చోబెట్టుకుని, 'ఒక సామాన్యుడిలా ఈ సమాజానికి ఏమివ్వగలం! ప్రేమతో కూడిన మంచి కుటుంబం తప్ప. దాన్ని మించినది ఇంకేదైనా ఉందా? ఇదిగో..ఈ జన్మకే వీడు నీకు తమ్ముడు, ఈ జన్మకే నేను మీకు నాన్న' అంటాడు. ఇవ్వాళ సమాజంలో తగ్గిపోతున్న మానవ సంబంధాన్ని తక్కువ మాటల్లో ఎంతో హెచ్చరించినట్టు విస్తృతార్థంతో చెబుతాడు. కుటుంబం నుండే సమాజం ఏర్పడుతుంది. కుటుంబం మంచిదైతే సమాజం మంచిదవుతుంది. కుటుంబం అనే కోటను దుర్భేద్యంగా మలచుకోవడానికి మానవ సంబంధాలు రక్షక భటుల్లా వెన్నంటి ఉంటాయి. పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పదిమందైనా, ఇరవైమందైనా ఒకే ఇంట్లో కలిసి మెలిసి ఉండేవాళ్లు. ఒక రాజ్యానికి రాజులా ఇంటి యజమాని ఉండేవాడు. విలువలు, మర్యాదలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, సుఖదుఃఖాలు..అన్నిటినీ అందరూ కలిసి పంచుకునేవారు. ఇలా పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ మానవత్వ విలువలతో 'నేను' అనే అహానికి తావులేకుండా 'మనం' అనే కలివిడి కుటుంబాలు మానవీయ సంబంధాలకు ప్రతిబింబాలుగా భాసిల్లాయి. ఏ ఇంట్లో చూసినా వావివరుసలు, నోరారా పిలుపులు, కమ్మని భోజనాలు, పాడిపంటలు, సరదాలు, సంబరాలు వెల్లివిరిసేవి. అవన్నీ ఇంటికే పరిమితం కాకుండా, వాటన్నిటినీ ఇరుగుపొరుగు వారితో, ఊరివారితో పంచుకునే వాళ్లు. ఎవరికైనా ఏదైనా కష్టం వస్తే ఇంటి యజమాని వారి పక్కన నిలబడి 'నేనున్నాను' అనే భరోసా ఇచ్చేవాడు. అలాగే ఊరి సమస్యలు అంతా పంచుకునేవాళ్లు. వీటన్నిటిలోనూ అంతర్లీనంగా ప్రేమ, విశ్వాసం, నమ్మకం, గౌరవం అనేవి మనుషుల మధ్య మానవసంబంధాలను బలపరచేవి. అలా ఏర్పడ్డ మానవసంబంధాలు కలుషితాన్ని సైతం కలుపుకుపోయే నదీప్రవాహంలా సాగిపోతూ సమాజమనే సౌధాన్ని నిర్మించేవి. అలాంటి కుటుంబసౌధాల్లో మంచిమాట, మంచి పొగడ్త, పవిత్రత, హద్దులు, కట్టుబాట్లు అదృశ్యంగా ఐకమత్యానికి అండగా నిలబడేవి. 'భద్రత' అనే కవచం ఇంట్లో ప్రతివ్యక్తికీ రక్షణగా ఉండేది.

**పిలుపులు:** ఇంట్లోకి అడుగుపెట్టగానే ఆరంభమయ్యే మానవసంబంధాల సంబోధనలు కడుపునింపేలా ఉండేవి. 'బాబాయ్ బాగున్నావా? పిన్నీ కులాసానా?' అంటూ పిల్లలనుండి పెద్దల వరకూ వావివరసలతో కమ్మని పిలుపుతో పలకరించేవాళ్లు. పెద్దలపట్ల గౌరవమర్యాదలు, భయం, భక్తి తప్ప అలక్ష్యం, అలసత్వం ఉండేవి కావు. నేడు వీధికొకటి పుట్టుకొస్తున్న వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాలు ఆరోజుల్లో మచ్చుకైనా కన్పించేవి కావు. పండగ వచ్చిందంటే చాలు..సంస్కృతి సంప్రదాయాలతో ఊరు ఊరంతా సంబరాలు జరుపుకునేవాళ్లు. కానీ నేడు కాంక్రీట్ జంగిళ్లలా మారిపోయిన నగరజీవితాలు తగరపు జీవితాలయ్యాయి. పట్టుకుంటే శబ్దం, ముట్టుకుంటే నిశ్శబ్దం. అందుకే కోల్పోతున్న మానవ సంబంధాల్నీ, సంస్కృతి సాంప్రదాయాల్నీ, ఆప్యాయతానుబంధాల్నీ ఏడాదికోసారైనా మననం చేసుకోవడానికి నగరాల నుంచి పల్లెలకు పరుగులు తీస్తున్నారు.

విదేశాల్లో ఉన్నవాళ్లు పండుగలకు స్వదేశం తరలి వస్తున్నారంటే కారణం మననాగరికత, ఎన్నటికీ వసివాడని మానవ సంబంధాలపై ఉన్న మక్కువే. అందుకే 'మనం' అనే బంధానికి బందీకాని కుటుంబం ఉండదేమో! నేటికీ విన్పించే మా అన్నయ్య, మా అక్కయ్య, మా తమ్ముడు, మా చెల్లి అంటుంటాం. మంచికీ, చెడుకీ కుటుంబంలోని సభ్యులంతా సంఘటితమైనట్టు ఇరుగుపొరుగు వాళ్లకి ఏ ఆపద వచ్చినా, తమతమ బేధాలకతీతంగా అండగా ఉండేవారు. దీనికి కారణం మానవసంబంధాల మీదున్న గౌరవమే. ఇంతటి మహత్తరమైన మానవసంబంధాలు ఎదుటి వారిని పొగటం వల్లనో, ఆకలికి అన్నం పెట్టటం వల్లనో, ఆపదలో ఆదుకోవటం వల్లనో ఏర్పడేవి కావు. మనుషుల్ని మానవత్వం నుండి దూరం చేసే అరిషడ్వర్గాలకు అతీతంగా..మనసుతో మనసు మమైకమైనప్పుడే ఏర్పడేవే 'మానవసంబంధాలు'.

### మానవసంబంధాల్ని ప్రభావితం చేసే అంశాలు

జీవితంలో మానవ సంబంధాల్ని ప్రభావితం చేసే అంశాలలో మొదటిది కుటుంబం. రెండవది సమాజం. కుటుంబంలో ప్రధాన వ్యక్తులు తల్లిదండ్రులే. తల్లి నవమాసాలూ మోసి జన్మనిచ్చి, మనల్ని సమాజంలోకి తీసుకొస్తే, తండ్రి విద్యాబుద్ధులు నేర్పించి, విలువలతో కూడిన గుర్తింపును, హోదాను కల్పిస్తాడు. మానవ సంబంధాల్లో కుటుంబ వ్యవస్థ మరో ముఖ్యమైన అంశం. వ్యవస్థకు పునాది వివాహం. సంతానాభివృద్ధికి, సమాజాభివృద్ధికి మనుగడకు ఇది ఎంతో అవసరం. ఇద్దరు అంతకు మించిన వ్యక్తులు ఒక ప్రదేశంలోనో, ఒక ప్రాంతంలోనో కలిసి జీవించాల్సి వచ్చినప్పుడు 'మానవ సంబంధాలే' వాళ్లని ఒకటి చేస్తాయి. ఇవే సామాజిక సంబంధాలుగా మారతాయి. సృష్టిలో ఏ ప్రాణికీ లేనిది, మనిషి మాత్రమే సొంతమైన రెండు లక్షణాలున్నాయి. ఒకటి ఆలోచన, రెండు క్షమాగుణం. మంచి ఆలోచనలున్నవారికి మానవ సంబంధాలపట్ల గౌరవం, తప్పుజరిగినా క్షమించే గుణం ఉంటాయి. ఈ రెండింటినీ మనిషి కాపాడుకుంటే చాలు మానవ సంబంధాలు బలంగా ఉంటాయి. ప్రేమను పంచివ్వడం, ప్రేమను పొందటం తెలిస్తే చాలు ఎంతటి కఠిన మనస్కులనైనా మానవ సంబంధాలు అయస్కాంతంలా ఆకర్షిస్తాయి. మదర్‌థెరెస్సా, మహాత్మాగాంధీ, వివేకానంద వంటి వారు దీనినే పాటించి, మరణానంతరం కూడా లౌకిక ప్రపంచంలో మానవ సంబంధాలను ప్రభావితం చేయగల్గుతున్నారు.

### ఎంత సంపద ఉన్నా వ్యర్థమే

ఎప్పుడైతే 'అమ్మా, నాన్న' పిలుపుల్ని తప్పించి, 'మమ్మీ, డాడీ' పిలుపులు ఆక్రమించుకున్నాయో, ఆనాటి నుండే మానవీయ సంబంధాలు తెరమరుగు కావడం ప్రారంభించాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోయి, న్యూక్లియర్ కుటుంబాలు ఏర్పడినప్పటి నుండి మనుష్యుల్లో మానవసంబంధాలు అంతరించడం అరంభించాయి. సాంకేతిక సంబంధాలు ఆస్థానాన్ని ఆక్రమించుకున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో తాతాయ్య నానమ్మలు



చిన్నపిల్లలకి రామాయణ భారతాల్లో ఉన్న మానవసంబంధాలు, విలువల గురించి ఉగ్గుపాలతో నేర్పించేవారు. రామాయణం, మహాభారతం, బైబిల్, ఖురాన్ వంటి మతపరమైన గ్రంథాల్లో విలువైన మానవ సంబంధాల గురించి వివరించబడ్డాయి. 'కనీసం ఒక్కసారైనా రామాయణ కావ్యం చదువుకొనని వారికి ఎన్ని ఆస్తులున్నా.. ఎన్నికోట్ల సంపదలున్నా వ్యర్థమే' అంటారు చాగంటివారు.

### యాంత్రికత, కృత్రిమత, తాంత్రికత:

ఈమూడు ప్రపంచవ్యాప్తంగా మానవ సంబంధాల్ని వ్యాపార సంబంధాలుగా మార్చాయి. కంప్యూటర్లు, టీ.వీలు, రోబోలు, సెల్‌ఫోన్లు మనుషుల మధ్య మాటల్ని, మానవ సంబంధాల్ని కబళిస్తున్నాయి. పూర్వకాలంలో వృత్తిపరమైన సంబంధాలు కూడా మానవ సంబంధాల్లో భాగమయ్యేవి. రజకుడు, క్షురకుడు, కంసాలి, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి మనుషుల మధ్య అనుబంధాల్ని బలపరచేవి. ఇవ్వాళ కాదేదీ వ్యాపారానికి కనర్హమన్నట్లు కులవృత్తులపైన కన్నేసిన కార్పొరేట్ వ్యాపారులు, సంస్థలు..మానవ సంబంధాలు కనుమరుగైపోవడానికి పరోక్షంగా తమవంతు పాత్ర పోషిస్తున్నారు. మనుషులే కాకుండా సంగీతం, సాహిత్యం, నృత్యం, కళలు, క్రీడలు, జానపదకళలు, కులవృత్తులు ఇవన్నీ మానవ సంబంధాల్లో భాగాలే. కళలలో నిపుణులైన కళాకారులతో మనకు ప్రత్యక్ష పరిచయం లేకపోయినా వారిని అభిమానిస్తాం. ఆరాధిస్తాం. మానవ సంబంధాల్లో అంతర్లీనంగా ఉండే గొప్పదనాన్ని ఆస్వాదిస్తాం.. గుర్తుంచుకుంటాం.

### మేముసైతం

మనుషులే కాకుండా మనుషులు పెంచుకునే జంతువులు, పక్షులు మానవ సంబంధాల్లో భాగమవుతున్నాయి. యజమాని, కుటుంబ సభ్యులు కన్పించగానే వాటికంటి చూపులో, అరుపులో అనుబంధాన్ని వ్యక్తపరుస్తాయి.

### వారసత్వపు వారధులు

మహాత్మాగాంధీ. అబ్దుల్‌కలాం, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, నెల్సన్‌మండేలా, సచిన్‌టెండూల్కర్, మైకేల్‌జాక్సన్, మదర్‌థెరెసా వంటి ఎంతోమంది తమ ప్రతిభతో ప్రపంచమంతటా మానవ సంబంధాలు కలిగి ఉన్నారు.

**ప్రకృతితో:** మానవ సంబంధాలు ప్రకృతితోనూ మమైకమై ఉన్నాయి. మనిషికి చెట్టుతో, మట్టితో, పంటపైరులతో ఏర్పడే బంధాల్లో మరో పార్శ్వం కన్పిస్తుంది. గౌతమ బుద్ధుడు చెప్పినట్లు సమస్త ప్రాణులతో మనిషికి ఉండాల్సిన మైత్రీభావనని అర్థం చేసుకున్నవే. మానవ సంబంధాలు అచేత అనుబంధాలుగా బలపడి ఒకతరం నుండి మరో తరానికి అందించబడతాయి. అందుకే ఓ రచయిత మానవసంబంధాల్ని వారసత్వపు వారధులుగా పోల్చారు. ఆ కారణంగానే ఎంతోమంది విదేశీయులు మన విలువలకి, సంస్కృతికి, సంప్రదాయాలకీ, వివాహవ్యవస్థకీ, వసుధైన కుటుంబ భావనకు సలాములు చేస్తున్నారు.

### తరమెళ్లిపోతోంది

'పడవెళ్లీపోతోందిరా! ఓ మానవుడా! దరిచేరే దారేదీరా!' అనే పాతపాట విన్నప్పుడల్లా 'తరమెళ్లీ పోతోందిరా!' అన్నట్టనిపిస్తుంది. రాబోయే పది, పదిహేనేళ్లలో ఒక తరం ప్రపంచం నుండి నిష్క్రమిస్తుంది. మంచి చెడులు, తప్పొప్పులు సరిదిద్దే పెద్దతరం, పెద్దతనం కనుమరుగవ్వబోతోంది. జనరేషన్ గ్యాప్ అని మనం ఎంత సమర్థించుకున్నా, నాగరిత పేరుతో నానాటికీ పెరిగిపోతున్న విచ్చలవిడితనం, బరితెగింపు, అదుపు తప్పిన అలవాట్లు, కట్టుబాట్లు లేని వికృతచేష్టలు, వలువలూడదీసి బజారెక్కుతున్న విలువలు, కుటుంబ నేపథ్యాన్ని వదిలేసే, 'లివింగ్ టు గెదర్' సంస్కృతి, సరోగసి వంటి వింత పోకడలతో యువతరం ఎటువైపు వెళ్తోందో అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొంది నేడు. 'చెప్పేవాళ్లు లేకనా? ఒకవేళ చెప్పినా వినే సమయం లేకనా? కారణం ఏదైనా నేడు సహజాలన్నీ అసహజాలైపోతున్నాయి. కన్నతల్లిదండ్రుల మాటలు కంటగింపై పోతున్నాయి. మనీ, మెషీన్, టెక్నాలజీ, ఫ్యాషన్ ఇవే సర్వస్వం అనుకుంటూ మానవ సంబంధాలకతీతంగా, యాంత్రికంగా జీవిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లోనో, మొబైల్‌తోనో సంబంధం పెట్టుకుని దైనందిన జీవితబంధాలన్నీ తెంచుకుంటున్నారు. మానవసంబంధాలు కూడా అమెజాన్‌లో, ఫ్లిప్‌కార్ట్‌లో, యంత్ర, బిగ్‌బాస్కెల్, స్విగ్గీ, జూమాటోల్లో దొరుకుతాయా? మనిషి జీవించడానికి కావాల్సిన సమస్తాల్నీ ఆన్‌లైన్లో తెప్పించుకుంటున్నారు గానీ, అనురాగాలు, ఆప్యాయతల్నీ స్మార్ట్‌ఫోన్లో బుక్ చేసుకుని ఆన్‌లైన్లలో తెప్పించుకోగలరా? గలరేమో! వినాయక చవితి పత్రిని, మట్టి వినాయకుణ్ణి ఆన్‌లైన్లో తెప్పిస్తున్నారు. పిడకలు మొదలు చెప్పుల వరకూ కాదేదీ ఆన్‌లైన్‌కి అనర్హం అంటున్నారు.

### ఆప్యాయత, అనుబంధాలు సాంకేతికతో కొనలేం

ఓ సాఫ్ట్‌వేర్ కుర్రాడు ఓ పెద్దాయనతో 'ఒకళ్లని చూసి మరొకళ్లు ఎమోషనలవ్వటం, గతంలో బ్రతకడం, కాల్పనిక మార్పుల్ని అంగీకరించకపోవటం, ఇవేగా మీరు చెప్పుకుని ఆప్యాయతలు' అన్నాడు.

'నువ్వు చెప్పింది కరెక్టో కాదో మీ 'గూగుల్ మాత'ని అడుగు' అన్నాడా పెద్దాయన. వెంటనే ఆ కుర్రాడు తన స్మార్ట్‌ఫోన్లో గూగుల్‌లో వెతికాడు. ఎంత వెతికినా అతనికి కావాల్సిన సమాధానం రావటం లేదు. సరికదా.. ఆప్యాయత ఎన్ని ఉదాహరణలు చెప్పినా, కుర్రాడు కౌంటరిస్తూనే ఉన్నాడు. చివరికి సహనం నశించిన ఆ పెద్దాయన కుర్రాడి చెంపమీద లాగి కొట్టాడు. వెంటనే కుర్రాడు 'అమ్మా' అన్నాడు అవాక్కయి. వెంటనే ఆ పెద్దాయన 'ఇదే ఆప్యాయత అంటే! నువ్వు ఫ్లాష్‌లోకెళ్లి నీకెదురుగాలేని మీ అమ్మని పిలిచావే..అదే ఆప్యాయత' అని నవ్వుతూ వెళ్లిపోయాడు.



### వారధి మీరే

నేడు మానవ సంబంధాలు, ఆప్యాయతల గురించి పిల్లలకి వివరించే తల్లిదండ్రులేరి? భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలకెళితేగానీ గడవని ఈ పరుగుల జీవితాల్లో, అమ్మానాన్నల ఒక్క సెకను సమయాన్ని పిల్లలు కొనాలంటే..లీటరు పెట్రోలు ధరకంటే ఎక్కువయ్యే రోజులివి. వీకెండ్స్ లో ఇంట్లో అమ్మానాన్నలు తారసపడినపుడు 'ఎలా చదువుతున్నావు? మార్కులెన్ని? ఎందుకు తగ్గాయి' వంటి ఎంక్వయిరీలతోనే గడిచిపోతోంది. మంచిచెడులు చెప్పే పెద్దవాళ్లని ఉండనివ్వడానికి తగిన వైశాల్యం ఇంట్లో ఉన్నా కుచించుకుపోయిన వాళ్ల కన్నపిల్లని హృదయం వైశాల్యంలో ఇమడలేక పెద్దవాళ్లు వృద్ధాశ్రయాలను ఆశ్రయిస్తున్నారు. వార్థక్యానికి, బాల్యానికి మధ్య ఉండే అనుబంధానికి మనమే అడ్డుగోడలు ఏర్పరచుకుంటున్నాం.

దీనికి కారణం కాలానికి తగ్గ మార్పులని సరిపెట్టుకుంటూనో, లేక జనరేషన్ గ్యాప్ పేరుతో తల్లిదండ్రుల్ని వదిలించుకుంటే సరిపోదు. ఎందుకంటే ఇవ్వాళ మంచిచెడులకు తేడా చెప్పే తీరిక మీకు లేదు. చెప్పినా వినే ఓపిక వాళ్లకి లేదు. మంచికి చెడుకి మధ్యస్తంగా విచక్షణ కోల్పోయి అకృత్యాలకి పాల్పడుతోంది మాబిడ్డలే. కాబట్టి ఇంటి యజమానిగా సంయమనం పాటించి పాతతరాన్ని గౌరవిస్తే, ఆ తరం ఇంకొన్నాళ్లు బ్రతికి ఉంటుంది. వాళ్ల జీవితానుభవసారం మన వారసులు వినగల్గుతారు. అలా వింటే చాలు వాళ్లలో విలువలు మొలకలేస్తాయి. మరో తరానికి అవి బోధివృక్షాలవుతాయి. అందువల్ల పాతతరానికి చెప్పే అవకాశం, కొత్త తరానికి వినే అవకాశం కల్పించాల్సిన వారిధి మీరే.

చదువులపేరిట పిల్లల్ని ఇంట్లో పెద్దలకి దూరం చెయ్యకండి. పాతతరానికి కొత్త తరానికి మధ్య అడ్డుతెర కట్టకండి. ఎందుకంటే రాబోయేతరం కాసో కూస్తో పాత విలువల్నీ, వికాసాన్ని నేర్చుకోగలిగేది, గ్రహించగల్గేది మీ తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే! వాళ్లు బ్రతికుండే ఆ కొద్దసమయాన్ని చేజారనీయకుండా సద్విని యోగం చేసుకోండి. జీవిత చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులు గోడలమీద ఫోటోలుగా వేలాడకముందే, మీరే వారధిలా మారండి. ఆ తరం అందించే అనుభవాల జావళీలను వారిదగ్గర నేర్చుకుని హాయిగా మీ పిల్లల్ని పాడుకోనివ్వండి. అవన్నీ భవిష్యత్తులో తప్పటడుగులు వెయ్యకుండా వాళ్లలో సహజసామర్థ్యాన్ని వృద్ధిచేస్తాయి. పిల్లల ఎదురుగా మన తల్లిదండ్రుల్ని మనం గౌరవించకపోవడమే మనం చేసే తప్పని తెలుసుకోవాలి. మన పిల్లల దృష్టిలో మన తల్లిదండ్రులు పాతచింతకాయ పచ్చడి లాంటివారు కావచ్చు. కానీ ఆ పాత చింతకాయ పచ్చడి తరానికీ, ఇవ్వాల్టి పిజ్జా బర్గర్ల తరానికీ మధ్య మనం ఇడ్లీ సాంబారులా..వారధిలా ఉండాలి. పాతతరం కనుమరుగవ్వకముందే, వాళ్ల అనుభవాల్ని అనుభూతుల్ని రాబోయే తరానికి వాళ్ల ద్వారానే పంచిపెట్టాలి. అప్పుడే ఒకనాటి ఉమ్మడి కుటుంబపు మధురిమలు..'తోబుట్టువుల మంచిచెడ్డలు, వేపపుల్లతో దంతధావనాలు,

సున్నిపిండితో ఒంటినలుగులు, కుంకుడునురగ తలంట్లు, తెలుగు నెలలు, తిధివార నక్షత్రాలు, నిస్వార్థపూరితమైన పాతతరం ఆప్యాయతల్ని మన పిల్లలు కనీసం తెలుసుకోగల్గుతారు. తొలికోడి కూతలు, వేగుచుక్క వెంట నాగలి కదలికలు, ప్రభాతాన ముఖం కడుక్కునే బోదుల సవ్వడులు, పంటపొలాల కమ్మని వాసనలు, ఆకుమడుల కేరింతలు, మబ్బులు కురిసే చినుకుపుష్పాలను దోసిలి పట్టిన మనుష(సు)ల ఆప్యాయతానుబంధాలు

**మానవసంబంధాలు కాకమరేంటి?:** నేటితరం క్రమంగా దూరంగా జరిగిపోతూ, చెరిపేస్తున్న విలువ, వెలకట్టలేని తిరిగిరాని ఆణిముత్యాలు. మానవ సంబంధాలన్నిటి లోకెల్లా కుటుంబబంధాలు అనుబంధాలే మనిషి జీవితం మీద ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. కుటుంబం అనుబంధాలకు దేవాలయం. కుటుంబంలో ఉండే సంబంధబాంధవ్యాల వల్లనే సమాజంలో మనిషిస్థాయి, స్థానం నిర్దేశించబడుతుంది. అందుకే ఇంటగెలిచి-రచ్చగెలవమంటారు.

ఒక అబ్బాయికీ, అమ్మాయికీ జన్మనిచ్చారంటే జీవితకాలబంధాలకు మీరు అంకురార్పణ చేసినట్టే. అంటే తల్లిదండ్రులుగా ఆపాత్రలు జీవితాంతం పోషించాల్సిందే. మీ పెంపకం ప్రభావం మీ పిల్లలమీద, వాళ్ల పిల్లల మీద, ఇంకా చెప్పాలంటే తరతరాల సంబంధ బాంధవ్యాలమీద ఉంటుంది.

**తరాల అంతరాలు**

క్షణక్షణానికి మారిపోతున్న సాంకేతిక అభివృద్ధితోబాటు, ఈ తరపు పిల్లల్లో 'ఐ.క్యూ' కూడా ఎక్కువే. మనుషుల మధ్య ఉండాల్సిన మానవసంబంధాలు సాంఘిక మాధ్యమాల మాటల్లో ఇరుక్కుపోతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య తరాల అంతరాలు, క్షణక్షణానికి మారిపోతున్న సాంకేతిక అభివృద్ధితో పాటు, ఈ తరపు పిల్లలలో 'ఐ.క్యూ' కూడా ఎక్కువే. మనుషుల మధ్య ఉండాల్సిన మానవ సంబంధాలు సాంఘిక మాధ్యమాల మాటల్లో ఇరుక్కుపోతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులకీ, పిల్లలకీ మధ్య దూరం పెరిగిపోతోంది. 'పలుకే బంగారమాయెనా' అన్నట్టుంటోంది. కుటుంబ సభ్యులు మనసులు విప్పి మాట్లాడుకునే పరిస్థితి కనుమరుగవుతోంది. అవసరాల తడిపొడి పలకరింపులే కన్పిస్తున్నాయి. దీని వల్లనే మానవ సంబంధాలు మసకబారుతున్నాయి.

**తల్లిదండ్రులూ..! వన్ మినిట్**

ఇవ్వాళ పిల్లలు విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్తున్నారు. మేం కష్టపడి చదివించాం. మీరు మమ్మల్ని చూడాల్సిందే..! అనే ధోరణి మధ్య తరగతి, కింది తరగతుల్లో స్పష్టంగా తెలుస్తోంది. పిల్లల మీద ఖర్చు పెట్టిందానికి పది రెట్లు అధికంగా వసూలు చేస్తూ భోగలాలసత్వానికి అలవాటు పడుతున్నారు. 60ల్లోనూ 20ల్లా తల్లిదండ్రులు ప్రవర్తిస్తున్నారు.

ఆ రోజుల్లో మీరు పెరిగిన వాతావరణం



వేరు. అప్పటి విలువలు, కట్టుబాట్లు వేరు. తరాలు మారుతున్నాయి. మారుతున్న ధోరణితో పాటు మీరూ మారాలి.

"ఆ కాలంలో మేం ఎంతో కష్టపడి పైకొచ్చాం. ఇప్పుడు మీరు కష్టపడకూడదని మీకు అన్ని సమకూర్చాం, ఇన్ని సమకూర్చాం.. ఇంత చేస్తున్నాం" అని క్లాసులు పీకే కాలం చెల్లిపోయింది. దీని వలన పిల్లలు ఇంటికి రావాలంటేనే భయపడే పరిస్థితి తలెత్తుతోంది."ఈ మధ్య విదేశాల్లో ఉన్న పిల్లల దగ్గరకి డెలివరీల కోసం తల్లిదండ్రుల్ని రప్పించుకోవడం



పరిపాటి అయిపోయింది. అలాగే అకస్మాత్తుగా తల్లో, తండ్రో మరణించినా దూర దేశాల్నించి పిల్లలు రాలేని పరిస్థితుల్లో.. వాట్సాప్, వీడియోల ద్వారా తల్లిదండ్రుల ఆఖరి చూపులు, కర్మకాండలు తిలకిస్తున్న సందర్భాలు సర్వసాధారణమైపోయాయి.

కడుపు తడిమి అన్నం పెట్టినంత మాత్రాన అమ్మ బాధ్యత, ఫీజులు కట్టి చదివించినంత మాత్రాన నాన్న బాధ్యత తీరిపోదు. బాల్యంలో వేలు పట్టి నడక నేర్పినట్టే, యవ్వనంలో కూడా పిల్లలు పక్కదార్లు పట్టకుండా, జీవితంలో సెటిలయ్యేవరకూ 'విలువైన నడత' నేర్పాల్సింది తల్లిదండ్రులే. అప్పుడే మన అనుబంధం వారిని వెన్నంటి ఉంటుంది. మనం మన పిల్లల్ని ఎంత గౌరవంగా, ప్రేమగా చూస్తే, వార్థక్యంలో వాళ్లు అంతకు రెట్టింపు ఆప్యాయతతో కంటికి రెప్పలా మనల్ని చూస్తారన్నది నిర్వివాదాంశం. యథా పేరెంట్స్.. తథా చిల్డ్రన్.

**పిల్లలూ గుర్తించాలి..**

పిల్లలకి పదేళ్ల వరకూ తల్లిండ్రుల అండదండలు అవసరం. పెరిగేకొద్దీ పిల్లలు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలి. ఈ రోజుల్లో రెండు, మూడేళ్ల పిల్లలే స్మార్ట్ ఫోన్లకి అడిక్ట్ అవుతున్నారు. ప్రాయం రాకముందే సహజ ఆకర్షణలు అంకురించకముందే అసహజాలు టెక్నాలజీ రూపంలో ఆజ్యం పోస్తూ- ప్రేమలు, హత్యలు, పన్నెండేళ్లకే గర్భధారణలు ఇంకా.. డ్రగ్స్, మద్యం ఒకటేమిటి.. పిల్లల్ని భ్రష్టు పట్టించే అంశాలన్నీ మన చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

ఒక లీటర్ పెట్రోలు మీద ఒక రూపాయి పెరిగితే, ఆ భారం మోస్తున్నది మీ తల్లిదండ్రులే అన్నది గుర్తించండి. వాళ్ల కష్టాన్ని అర్థం చేసుకోండి.

"నాస్తి మాతృ సమః సఖా / నాస్తి పితృ సమో గురుః" అన్నారు. అంటే తల్లితో సమానమైన స్నేహితులు, తండ్రితో సమానమైన గురువు ఉండరు. తాము అనుకున్నది జరగకపోతే తల్లిదండ్రులతో సంబంధాలు తెంచుకున్న పిల్లల్నీ, తమ మాట వినలేదని పిల్లల్ని హత్యలు చేసే తల్లిదండ్రుల్నీ చూస్తున్నాం.

వీటన్నిటికీ కారణం.. ప్రేమరాహిత్యమే. బంధాలన్నీ సరైన సమయంలో

(మిగతా 15వ పేజీలో)

# విప్లవ తపస్వి 'అల్లూరి' స్మృత్యంజలి



తెలుగునాట, విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామంలో తల్లి సూర్యనారాయణమ్మ పుట్టింట, 1897 జులై 4న జన్మించిన శ్రీరామరాజు (తాతపేరు), సీతారామరాజుగా తెలుగు ప్రజల స్వాతంత్ర్యేచ్ఛ, ఆత్మాభిమానం, పౌరుషాగ్ని, దేశభక్తి, త్యాగశీలతకు ప్రతీకగా సుప్రసిద్ధులయ్యారు. తండ్రి వెంకట్రామరాజు, స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దగ్గరలోని మోగల్లు గ్రామం. జాతీయ భావోత్తేజం, సంఘసేవ, సంస్కరణాభిలాషులు వెల్లివిరిసే అల్లూరివారి క్షత్రియ కుటుంబంలోని వెంకట్రామరాజు ఫొటోగ్రాఫర్ వృత్తిలో రాజమహేంద్రవరంలో 1908లో శ్రీరామరాజు చిన్నతనంలో మరణించారు. 1905 నాటి వందేమాతరం వంటి జాతీయోద్యమాలు దేశం నాలుగు చెరగులా ఉవ్వెత్తున పొంగిపొరలుతున్న రోజులవి. తండ్రిలేని బిడ్డగా నరసాపురం, భీమవరం, రామచంద్రపురం, కాకినాడ, విశాఖపట్నంలలో శ్రీరామరాజు ఆంగ్ల విద్య పట్ల నిరాసక్తతతో నాల్గవ ఫారం వరకు వానాకాలపు చదువు కొనసాగింది. చదువు కంటే శ్రీరామరాజుకు గుర్రపు స్వారీ, యోగాభ్యాసం, సంస్కృతం, ఆంధ్ర విద్యాభిమానం, వ్యాయామం, కవిత్వం, జ్యోతిష పాండిత్యం, నాటకాల పట్ల ఆసక్తి కలిగి వుండేవారు. కాకినాడలో ఉన్న రోజులలో 14వ ఏట అన్నవరం కొండ మీద ఉపనయనం జరిగింది. కాకినాడ హైస్కూల్లో ప్రాణసఖుడైన మద్దూరి అన్నపూర్ణయ్య, పంచమ జార్జి పట్టాభిషేక ఉత్సవం సందర్భంలో విద్యార్థులకు బహుమతిగా యిచ్చిన యూనియన్ జాక్ పతాకంలో అమర్చిన బ్రిటిష్ చక్రవర్తి పతకాన్ని, రాజుకు యివ్వగా ఆగ్రహంతో విసిరివేసిన సంఘటన 14వ ఏట నుంచి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతిఘటనను స్పష్టం చేస్తోంది. తుని, గోపాలపట్నంలో తల్లితో వున్న రోజులలో పదహారేళ్ల నిండే నాటికి, ఆధ్యాత్మిక పథం వైపు క్రమ క్రమంగా పరిపక్వతకు చేరారు. అక్కడ సీతమ్మవారి కొండపై వున్న గుడిలో తపోధ్యానం ఆచరించేవారు. తదనంతర జీవితంలో కృష్ణదేవి పేట సమీపంలోని ధారకొండ తపోస్థానంగా స్వీకరించారు.

## మన్యం ఆదివాసీల ఆరాధ్య దైవం 'అల్లూరి'

తల్లి ఆశించిన విధంగా శ్రీరామరాజు, కుటుంబ బాధ్యతను, జీవనోపాధిని పట్టించుకోలేదు. ఆధ్యాత్మిక పిపాసిగా కాశీ, హరిద్వార్, బ్రహ్మకపాలం 200 మైళ్ల కాలినడకన తపోదీక్షలో కొత్త వెలుగు సంతరించుకోగలిగారు. ఆనాటి విప్లవ వీరుల స్థావరమైన చిట్టగ్యాంగ్ వరకు పర్యటించి, పృథ్వీసింగ్ వంటి విప్లవకారుల పరిచయంతో ఆధ్యాత్మిక-విప్లవ అవలోకనం ఆరంభమైంది. 1914లో కాషాయ వస్త్రాలు ధరించని యువ పరిత్యాగిగా మన్యం సీమపై అడుగు పెట్టారు. కాశీలో ఒక సంవత్సరం సంస్కృత అభ్యసనం, రెండవ పర్యాయం మళ్లీ తీర్థయాత్రలు ఉత్తర దేశ జరవీ, మలకానగరీ, బస్తర్ అరణ్యాల పర్యటనలు 1917 నాటికి లౌకిక జ్ఞానిగా, సాహసోపేతమైన జీవన గమ్యానికి పునాదులు పడ్డాయి. జ్యోతిషం, హస్తసాముద్రికం, మూలికా వైద్యం, మంత్రశాస్త్ర విద్యలతో రామాయణ, భారత గ్రంథాలు భగవద్గీ నిత్య పఠనీయంతో శ్రీరామ, కాళీమాత ఉపాసకునిగా, నిష్కామ కర్మయోగిగా తపోదీక్ష స్వీకరించారు.

1917-1922లలో శ్రీరామరాజు అన్నెం, పున్నెం ఎరుగని అమాయక, నిస్సహాయ మన్యంసీమ కోయ జనావళికి ఆరాధ్య దైవంగా, క్షాత్ర విద్యల గెరిల్లా పోరాటంలో ఆరి తేరి అనితరసాధ్యమైన క్షాత్ర సాహసిక యువకునిగా బ్రిటిష్ అధికారులకు సింహస్వప్నంగా, కన్నెర్ర కలిగించారు. మాతృభూమి నుండి బ్రిటిష్ పాలనాధిపత్యాన్ని పారదోలే మన్యం విముక్తి స్వాతంత్ర్య సాధనా లక్ష్యంతో క్రమేపీ మన్యంసీమ యుద్ధక్షేత్రం అయింది. 19వ ఏట భారత జాతీయ కాంగ్రెస్ గయ సమావేశాలలో పాల్గొన్న అల్లూరికి, గాంధీజీ పట్ల గౌరవం వుండటంతో, మన్యం కోయలచే తాగుడు మాన్పించటం, న్యాయ స్థానాల బహిష్కరణ, పంచాయితీలు యితర గాంధేయ కార్యాచరణ కొనసాగించారు. క్రమేపీ మన్యం గిరిజనుల ప్రత్యక్ష దైవం అయిన శ్రీరామరాజు, నిరంకుశ క్రూర బ్రిటిష్ అధికారుల అసూయా ద్వేషాల కారణంగా ప్రతీకారాగ్ని తలఎత్తి, కర్మయోగిలో సమరాగ్ని ప్రజ్వరిల్లింది. బ్రిటిష్ ప్రభుత్వం, నర్సీపట్నం నుంచి లంబసింగి ఘాట్ రోడ్ నిర్మాణంలో, గూడెం తాహసిల్దార్ బాస్టియన్ అమానుష క్రూరహింసలు, అవినీతి, వెట్టి అకృత్యాలు, దౌర్జన్యాల అణచివేతల నుండి నిరక్షరాస్యులు, నిస్సహాయుల విముక్తి పోరాటంగా విప్లవాగ్ని రగిలి సాయుధ సమరం ఆవిర్భవించింది.

1922 జూన్‌లో శ్రీరామరాజు తల్లిని, తమ్ముణ్ణి నర్సాపురం పంపించివేసారు. పైడిపుట్ట పట్టాభూమి తిరస్కరించారు. బాస్టియన్ అప్పటికే సృష్టించిన నిరాధార ఆరోపణల కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం,

విధించిన పోలీస్ ఇంటర్నమెంటు ఆంక్షలు తొలగిపోవటంతో సమర సన్నాహానికి ముహూర్తం సిద్ధమైంది. 1922 సెప్టెంబరు 13న (తదనంతరం అగ్గిరాజుగా అండమాన్‌లో అసువులు బాసిన) మిత్రుడు పేరిచర్ల సూర్యనారాయణకు రాసిన ఉత్తరం, అడ్డాకుల అటవీ ప్రాంతంలో బ్రిటిష్ సైనికాధికారులకు పట్టుబడింది.

మిత్రమా!

నేను యుద్ధమును ప్రారంభించితిని. ఇంతవరకు నాలుగు ప్రదేశములలో మన సైన్యము బ్రిటిష్ సైన్యమును ఓడించింది. భగవానుని దయవలన జయము మన పక్షమునకే లభించినది. మన పూర్వ స్నేహమును జ్ఞప్తికి తెచ్చుకొని నీవు బయలుదేరి రావలెను. మృత్యువు జననమును వెన్నంటియే ఉండును. ప్రతి మానవుడు వాని వంతు వచ్చినపుడు మరణింపవలసినదే. కర్మ పరిపక్వమై కాలము సమీపించిన ఎక్కడున్ననూ ఏ మానవుడు మరణించడు? ఎంత శ్రద్ధతో ఈ శరీరమును పెంచి పోషించినను ఒకరోజు అది నాశనము కావలసినదే. మానవ శరీరములు శాశ్వతములు కావు. కానీ కీర్తి, అపకీర్తి శాశ్వతములు. మంచి-చెడ్డలు చిరకాలము నిలుస్తాయి. ఎవరైతే జయాపజయములను, కష్టసుఖాలను, చీకటి వెలుగులను సమ భావంతో చూడగలరో వారే ఆత్మ సాక్షాత్కారం పొందగలరని భగవద్గీత బోధించుచున్నది. మనకు యుద్ధంలో విజయం లభించిన యెడల భౌతికానందమును పొందగలము. యుద్ధములో మనము మరణించిన యెడల మనము వీరస్వర్గము నలంకరించి ఆనందించగలము. అందువలన ఈ విషయములన్నింటినీ నేను జాగ్రత్తగా ఆలోచించి దేశ క్షేమము కొరకు యుద్ధము అనివార్యమని పూర్తిగా విశ్వసించి ఈ సమరమును ప్రారంభించినాను.

చిత్తగించవలెను..

అల్లూరి సీతారామరాజు

శ్రీరామరాజు జీవిత కాలంలో లభించిన పై ఉత్తరంతో పాటు దుచ్చర్తి ముఠాదారు చెక్కాలింగం దొరకు, తల్లి సర్యనారాయణమ్మకు, తన ఆధ్యాత్మిక గ్రంథాల అట్టపైన శ్రీరామరాజు సంతకంగా తానే రాసుకొన్న ప్రత్యక్ష ఆధారాలు వుండగా ఆయన పేరు సీతారామరాజుగా ప్రచారంలోకి వచ్చింది. మన్యంసీమలో 16వ ఏట ప్రవేశించిన శ్రీరామరాజు తరువాత 11 సంవత్సరాలు కఠోర యువ తపస్విగా, దేశభక్తి, దైవభక్తి సమ్మిళిత కర్మయోగిగా, కుటుంబ బాంధవ్యాల పట్ల ఎటువంటి అనురక్తి లేకుండా మన్యంవిముక్తి సాయుధ సమరానికి అంకితమయ్యారు. ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కథనానికి ఎటువంటి ఆధారాలు లేవు. పుక్కిటి పురాణాలుగానే భావించాలి.



"అల్లూరి శ్రీరామరాజు అను నేను నా సహచరులతో ఈ పోలీసు స్టేషన్‌ను ముట్టడించి, సెంట్రీని ఆయుధగారపు గది తాళములు అడిగితిని. అతడు తాళములు ఇచ్చుటకు అంగీకరించలేదు. స్టేషన్ స్తంభమునకు సెంట్రీని కట్టివేసి అతని నుంచి తాళములు తీసుకొన్నాను. ఆయుధములు సేకరించబడినవి".

అల్లూరి శ్రీరామరాజు

విప్లవ తపస్వి-సాయుధ సమరం

మన్యం సాయుధ సమరం ప్రారంభించేనాటికి శ్రీరామరాజుకు 25 ఏళ్లు. ఆధ్యాత్మిక పవిత్రత వున్న కృష్ణదేవిపేట నీలకంఠేశ్వర ఆలయం వద్ద సమరభేరి మోగింది. దైవబలం తోడు రాగా ధర్మ సంగ్రామంలో ఆయుధ సేకరణ కోసం పోలీస్ స్టేషన్‌లపై మెరుపుదాడులతో విప్లవం ఆరంభమైంది. ఒకరోజు ముందు పరమనిష్ఠతో మహారుద్రాభిషేకం, శివ జాగరణ యజ్ఞ క్రతువుగా నిర్వర్తించి రంపచోడవరం ఏజెన్సీలోని చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై 1922 ఆగస్టు 22న ప్రప్రథమంగా మెరుపుదాడిగా 300 మంది అనుచరులు స్టేషన్ చుట్టుముట్టారు. గంటన్న, మల్లుదొరలు, ఎండుపడలు, గోకిన ఎర్రేసు వంటి విప్లవకారులు నాటుతుపాకులు, కత్తులు, బల్లేలు, విల్లంబులు ధరించి పోలీస్ స్టేషన్‌లో ఆయుధాగారం నుండి తుపాకులు, యితర ఆయుధాలు స్వాధీనం చేసుకొన్నారు, స్టేషన్ డైరీలో రాసి సంతకం చేసారు. ఆగస్టు 23న కృష్ణదేవిపేట, ఆగస్టు 24న రాజవొమ్మంగి, పోలీస్ స్టేషన్‌ల ఆయుధ సేకరణ క్షాత్ర ధర్మ యుద్ధ వ్యూహంగా సాగింది.

1922 సెప్టెంబరులో శ్రీరామరాజు వీరోచిత సాయుధ సమరశీలత్వంతో దుర్భేద్యమైన మన్యంసీమను గెరిల్లా రణతంత్రంగా నిర్మించుకొని సాధిస్తున్న విజయ పరంపరలు మద్రాస్ ప్రెసిడెన్సీ బ్రిటిష్ అధికారులకు గంగవెర్రులెత్తించాయి. సూర్యరశ్మి చొరబడని కీకారణ్యంలో కొండలు, కనుమల ఘాట్ రోడ్లు, అగాథాల లోయలు, లోతైన వాగులు, చెట్లు పుట్టల వెనుక కనపడని కాలిబాటలు, అటవీ ప్రాంతాలలో సంచరించే విష సర్పాలు, క్రూరమృగాలు అన్నింటికీ మించి మన్యం కోయవీరుల ధైర్య సాహసాలు బ్రిటిష్ ఉన్నత సైనికాధికారులను వణికించాయి. తాను ఎంత ద్వేషించే శత్రువైనా, 'శ్రీమన్మ'హారాజ రాజాధిరాజుగా శ్రీ అల్లూరి శ్రీరామరాజు, బ్రిటిష్ సార్వభౌమాధికార చక్రవర్తితో తలపడటంతో రాజనీతిని అనుసరించారు. మిరపకాయ టపా ద్వారా ముందే హెచ్చరించి, యుద్ధానికి ఆహ్వానించటం మన్య సమరంలో మహోన్నత నైతిక వ్యూహం. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని సమర వ్యూహం అది. బ్రిటిష్ ప్రభుత్వం మన్యం సమరాన్ని అణచివేయడానికి అరణ్యాలలో కొండలలో ఆరితేరిన స్కాట్‌కవర్డ్, హైటర్, ట్రైమన్ హీర్, చాడ్విక్, డాసన్ వంటి ఆంగ్లేయాధికారులను రప్పించింది. నర్సీపట్నానికి 25 మైళ్ల దూరంలో ఒంజేరీ ఘాట్‌లో సెప్టెంబరు 3న పోరులో ట్రైమన్, బతుకుజీవుడా! అంటూ పారిపోయి ప్రాణాలు దక్కించుకొన్నాడు. 1922 సెప్టెంబరు 21 భాద్రపద పౌర్ణమినాడు గూడెం దగ్గర వున్న గాలికొండపై కాళీపూజకు శ్రీరామరాజు పిలుపు యిచ్చారు. సెప్టెంబరు 18న పెదవలసలో టాల్‌బట్ సైన్యానికి ఘోర పరాభవం ఎదురైంది. 23వ తేదీన స్కాట్ కవర్డ్‌కు మిరపకాయ టపా వచ్చింది.

ప్రియమైన స్కాట్ కవర్డ్,

మీరు నా కోసం గాలిస్తున్నట్టు, నాకు

దగ్గరలో వున్నట్టు తెలుస్తోంది. ఇక్కడికి వచ్చి మాతో పోరాడుతారా? లేక మమ్మల్నే మీ దగ్గరికి రమ్మంటారా?
- అల్లూరి శ్రీరామరాజు



శ్రీరామరాజు నిజాయితీగా మాటకు కట్టుబడే రణనీతిజ్ఞుడని అతనిని మట్టుపెట్టే అవకాశం లభించిందని బ్రిటిష్ సైన్యాధికారులు ఎగిరి గంతులేసారు.
ప్రియమైన రాజూ!
నిజమైన భారతీయుడివైతే మాతో పోరాటానికి అక్కడ ఆగవలెను. మేము రేపు ఉదయం 9 గంటలకు అక్కడకు వస్తాము.
**- స్కాట్ కవర్డ్**

1922 సెప్టెంబరు 24న గాముకొండకు, ధారకొండకు, మధ్య దామనపల్లి లోయలో ఎంతో అప్రమత్తంగా తుపాకులతో నడుస్తున్న బ్రిటిష్ సైన్యంపై మన్యంవీరులు ఆంధ్రజాతి పౌరుష ప్రతాపాగ్నికి చిహ్నాలుగా తుపాకి పేలుళ్ల ప్రతిధ్వనించాయి. స్కాట్ కవర్డ్, హైటర్‌ల మృతదేహాలు తీసుకువెళ్లటానికి, బ్రిటిష్ ప్రభుత్వం రూ.500ల జరిమానా చెల్లించవలసి వచ్చింది. నర్సీపట్నంలో పూడ్చి సమాధులు నిర్మించారు.

**బ్రిటిష్ ప్రభుత్వానికి సింహస్వప్నం**

1922 అక్టోబరు 16న అనుకొన్న పథకం ప్రకారం శ్రీరామరాజు అడ్డతీగల పోలీస్ స్టేషన్, అక్టోబరు 19న రంపచోడవరం దాడులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసాయి. మలబార్ పోలీస్ దళంతో రామవరంలో ఎదురుకాల్పులలో సాండర్స్ వైఫల్యంతో వెనుతిరగవలసి వచ్చింది. 1922 నవంబరు 8న శ్రీరామరాజు దార్‌కొండ దేవాయలంలో పూజ నిర్వర్తించారు. మన్యంసీమలో తుఫాన్, అతివృష్టి కోయ కుటుంబాలను, సైనిక దళాలను దోమల బాధ మలేరియా పీడించటంతో పోరాట విధానాలు మార్చుకొనే పరిస్థితులు తలెత్తాయి.

1922 డిసెంబరు 6న మన్యం పోరాట చరిత్రలో పెదగడ్డపాలెం విప్లవ సేనకు తీవ్ర విఘాత ఘట్టం అయింది. 13 మంది విప్లవ వీరులు మరణించారు. 1923 మార్చి మొదటి వారం వరకు విప్లవకారుల నిశ్శబ్దతతో తెల్లదొరతనం ఊపిరి పీల్చుకొంది. 1923 ఏప్రిల్ 17న అన్నవరం కొండపై శ్రీరామరాజు ప్రత్యక్షం కావటం అర్ఘ్యపాద్యాలతో, ఫలపుష్పాలతో పూజలు చేసి ఆ విప్లవ తపస్వికి ప్రజలు సాష్టాంగ ప్రణామాలు అందించారు. 1923 ఏప్రిల్ 21న ఆంధ్ర పత్రిక ఆ వివరాలు ప్రముఖంగా ప్రచురించింది. బ్రిటిష్ అణచివేత చర్యలతో మన్యం అగ్నిగుండం అవుతోంది.



విప్లవకారులు మంప, దారుకొండ, గాముకొండ లోయలలో రహస్య స్థావరాలుగా సింగవరం, లొడ్డి, కొండలయ్య గొంది నీటివనరులు కొండవాగుల మధ్య స్థావరాలు ఏర్పాటు చేసుకొన్నారు. శ్రీరామరాజుకు ప్రత్యేకంగా పూజ బస, యజ్ఞవాటిక ఏర్పాటు చేసుకొన్నారు. శ్రీరామరాజుకు ప్రత్యేకంగా పూజ బస యజ్ఞవాటిక వుండేది. 1923 నవంబరు 5న బ్రిటిష్ పటాలం కొండలయ్య గొందిపై దాడి చేసింది. అయినా బ్రిటిష్ దొరలను శత్రువులుగా ద్వేషించినా శ్రీరామరాజు ధర్మనిష్ఠ, నిజాయితీతో వ్యవహరించేవారు. నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట మీదుగా రంపోలు ఘాట్ గుండా సైనికులకు పెదవలస శిబిరానికి ఆహార పదార్థాలు వెళ్లేవి.

ప్రియమైన పీటర్‌సన్,
నా సహచరుడు అగ్గిరాజు జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రొట్టెలు అతని కొరకు మీ వారి నుంచి తీసుకొన్నాను. అందుకుగాను మీకు ఒక బుట్ట పండ్లు పంపుతున్నాను. నన్ను గురించి చెడుగా భావించరని తలంచెదను. పెద్దవలస సైనిక శిబిరంపై ఒక నెలలో దాడి చేస్తామని పోస్టలు రసీదు వెనుక హెచ్చరిక రాసి పంపారు. అదీ అల్లూరి వ్యక్తిత్వం. ఆ విప్లవ యోధుడు మన్యం విప్లవాన్ని నడిపించిన తీరుతెన్నులు స్పష్టం అవుతోంది.

**భారతమాత పాదార్చనలో..**

1923 సెప్టెంబరు 17న, మలబార్ పోలీసు దళానికి, మల్లుదొర నిర్బంధానికి గురి కావటం మన్యం పోరాట చరిత్రలో ఒక దుర్దినం. మల్లుదొర పదమూడున్నర సంవత్సరాలు అండమాన్ ఘోర కారాగార వాస శిక్ష అనుభవించారు. ప్రప్రథమ పార్లమెంటు ఎన్నికలలో విశాఖ ఎస్.టి. నియోజక వర్గ ప్రతినిధిగా, స్వతంత్ర భారతిని కళ్లారా చూసిన ధన్యజీవి.

1923 అక్టోబరు 25న, అర్ధరాత్రి విప్లవ సేన గూడెంలోని మిలటరీ శిబిరంపై దాడి విఫలమైంది. మన్యం పోరాటానికి క్రమేపీ విషాద దినాలు సంక్రమించాయి. మన్యం సీమలో బ్రిటిష్ హింసా దౌర్జన్య అణచివేతలు, విప్లవకారులకు ఊపిరి సలపలేని ప్రాణాంతక పరిస్థితులు ఎదురయ్యాయి. యుద్ధ రంగంలో శ్రీరామరాజు అజేయుడు కావటంతో, ఆంగ్లేయాధికారులు కుటిల దమన నీతితో మన్యంను అగ్నిగుండంగా మార్చివేసారు. 1924 మే 6న అగ్గిరాజు నిర్బంధం, 1924 జూన్ 10న గంటందొర వీరమరణం చరిత్రగతిని విషాదమయం చేసాయి. 1923 డిసెంబరు నెలాఖరులో అఖిలభారత జాతీయ మహాసభలలో, కాంగ్రెస్ నేతలు అహింసా సిద్ధాంత పాషాండులుగా, తొలి పిడివాదంతో వ్యవహరించటం స్వాతంత్ర్య సమర చరిత్రలో ఘోర చారిత్రక కళంకమైంది.

1924 మే 7న, విప్లవవీరున్ని, నిరాయుధంగా బంధించి కొయ్యూరులో మేజర్ గుడాల్ కిరాతకంగా కాల్చిచంపటంతో 27 ఏళ్లకే ఆ విప్లవ తపస్వి అమరులయ్యారు.

1922-1924 రెండేళ్ల అల్లూరి సాయుధ సమర జ్వాలతో స్వాతంత్ర్య సమరం అగ్నిపునీతమైంది.

భారతమాత పాదార్చనకు స్వేచ్ఛా స్వాతంత్ర్య పుష్పాలుగా తరువాత దశాబ్దాలలో భగత్‌సింగ్, సుభాష్‌బోస్ వంటి ఎందరో సమరయోధులకు సమరదీప్తి ప్రసరింపచేసిన విప్లవ తపస్విగా అల్లూరి శ్రీరామరాజు మార్గదర్శకులయ్యారు.

**- జయసూర్య**

# పుస్తక సమీక్ష

## 'ఒక రాగం పలికింది'



సుప్రసిద్ధ సంగీత విద్వన్మణి, వైణిక విద్వాంసురాలు డి.పంకజమల్లిక్, సంప్రదాయ సంగీత, యోగసమ్మేళనంగా 24 రాగాలను గాయత్రీ మంత్ర బీజాక్షర్ఞో పాసనగా సంభావించి ఎంపిక చేసుకొన్న రాగాల అధ్యయనాన్ని వ్యాససంపుటిగా వెలువరించారు. సాహితీవేత్తగా, సంగీత కళాకారిణిగా, యోగసాధకు రాలిగా పరిశోధనాత్మకంగా సంగీత, యోగ బాంధవ్యాన్ని శ్లోకాలు ఉదహరిస్తూ రాగాలమాలికగా సంపుటీకరించిన ఈ గ్రంథంలో ఆయా రాగ ఛాయలున్న సినీగీతాలను, లలిత గీతాలను, ప్రసిద్ధుల రచనా విశేషాలను కూడా ప్రస్తావించారు. 'ఒక రాగం పలికింది' ఈ వ్యాససంపుటిలో ముఖ్యంగా యోగ సంబంధిత రాగాలు, లక్షణాలు, స్వభావాలు మానవ శరీరంపై ప్రభావం, ఆరోగ్యపరమైన ప్రయోజనాలు, యితర సద్విషయాలు రచయిత్రి విశ్లేషించారు. ఘనరాగాలలో ఒకటైన వరాళిరాగం గురుముఖతః నేర్చుకోవడం నిషిద్ధం వంటి ఆసక్తికరమైన అంశాలు రచయిత్రి పేర్కొన్నారు. సంప్రదాయ సంగీతం– యోగసాధనాల మేలికలయికగా ఇహపర ఆరోగ్య ఆధ్యాత్మిక శక్తులను సమన్వయిస్తూ రచయిత్రి డి.పంకజ్ మల్లిక వినూత్నరచనగా చదువరులను ఆకట్టుకోవడంలో కృతకృత్యత సాధించారు. సామాన్య శ్రోతకు, పాఠకులకు, బోధకులకు, విద్యార్థుల కు సంగీతజ్ఞులకు, సాహితీవేత్తలకు ప్రయోజనకరంగా, రాగాలను పలికించిన రచయిత్రి అభినందనీయురాలు.

**(ఒక రాగం పలికింది, రచన: డి.పంకజ మల్లిక్, వెల: రూ 150, ప్రతులకు: ఇ.నం.301, విజయశాంతి హోమ్స్, భవానీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్) - యర్రమిల్లి**

## కవిత్వీకరించిన సంపాదకీయ విశాలనయనం



ప్రముఖకవి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస చక్కటి విలువైన ముందుమాట రాసారు. ఈ పుస్తకాన్ని కోసూరురత్నంకి అంకితం చేశారు రచయిత. పాఠకుల ఆలోచనకు పదునుపెట్టి ప్రక్రియ సంపాదకీయం, కవిత్వం సంపాదకీయ స్థానానికి తీసుకెళ్లారు ఈతకోట సుబ్బారావు. 13సంవత్సరాలు 'విశాలాక్షి' పత్రిక కవిత్వ సంపాదకీయాలతో వెలువడటం గొప్పవిషయం. వర్తమాన పరిణామాలపై పాత్రికేయ వ్యాఖ్యానాన్ని కవిత్వసంవేదనతో వెలువరించిన సంపాదకీయాల సమాహారమే ఈ పుస్తకం. మహోన్నతులపై సంపాదకీయాలు, ప్రకృతి బీభత్సంపై మతవిద్వేషాల వ్యాప్తిపై అద్దెగర్భాలపై, వృద్ధాశ్రమాలపై ప్రభుత్వ అణిచివేతలపై రాజధాని నిర్మాణానికి మూడుపంటలు పండే పొలాలను తడిబెట్టడం మీద రాసిన కవిత్వంతో కూడిన సంపాదకీయాలు వెలువరించడం చాలాగొప్ప విషయం. సాహసపర్వతారోహకుడు మస్తాన్‌రావును 'విశ్వపు ఎత్తుల్ని పాదాలతో కొలిచిననేత్రమా' అని రాయడం. 'ఇంకెన్నాళ్ల గరికపోచలా పెరుగుదాం/ రండి తాడులా పేనుకుందాం!/ మద మెక్కిన గజరాజుపై తిరగబడదాం' అనడంలో వారి దృక్పధం కలిసిపిస్తుంది. కాలాన్ని సంఘటనల్ని సంపాదకీయ చట్రంలో అద్భుత ప్రతీకలతో కవిత్వంలో చెప్పిన సుబ్బారావుకి అభినందనలు.

**(విశాలనయనం, రచన: ఈతకోట సుబ్బారావు, వెల: రూ100, ప్రతులకు: ఇ.నం.24/1697, రెండవ వీధి, రవీంద్రనగర్, నెల్లూరు)**

**- తంగిరాల చక్రవర్తి**

## సృజనాత్మక స్వేచ్ఛ నవల

రచయిత్రి చుండూరు సీత సప్తతికి దగ్గరవుతున్న పరిణతి చెందిన రచయిత్రి. ప్రస్తుత పౌరాణిక నవల వీరి 8వ రచన. చదువు పదివరకు మాత్రమే అయినా బ్రతుకుబడిలో ప్రకృతిఒడిలో నేర్చుకున్నవెన్నో! ఈ చారిత్రక ఆధారిత నవల రామప్పగుడిలోని 'నాగిని'ని సారంగి అభివర్ణిస్తూ, ఆమె అందం, రూపలావణ్యం, సాహసం విలువిద్యాకౌశలం, తోటి




ఆటవికుల సంక్షేమానికి చెరువు, గుడి నిర్మించాలన్న నిశ్చయం గల యువతిగా చిత్రించారు. చారిత్రక నవల రాయటం 'అసిధారావ్రతం'. ఎన్నో ఊహాశాలిత సంఘటనలకు జన బాహుళ్యంలో ఉన్న నమ్మకాలకు చారిత్రక అంశాలకు విఘాతం కలుగకుండా రాయాలి. బహుశా ఈ కారణం వల్ల కావొచ్చు. కాకతీరాజుల పాలన, రామప్పలాంటి వ్యక్తుల పేర్లను మార్చివేసారు. రుద్రుడు సామంతరాజు, అర్జున వర్మరాజు రవికాంతుడు మరో సామంతరాజు. రుద్రుడి పూలినకతో ఒక చెరువు, పక్కనే రామలింగేశ్వరాలయం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని వనరులు సమకూర్చుకోవటంతో నవల ముగుస్తుంది. పాములుపట్టి జీవించే వృత్తి సారంగి తల్లిదండ్రులది. అయినా సారంగి ప్రతిభతో వారి జాతికి నాయకురాలు అవుతుంది. ఎందుకు పెడతారో చెప్పటంలాంటి విషయవివరణలు ఆసక్తిదాయకం. గొప్ప చారిత్రక(?) నవలను చదివామన్న సంతృప్తిని కలిగిస్తుందీ నవల.

**(సారంగి, రచన: చుండూరు సీత, వెల: రూ 150, ప్రతులకు: పాలపిట్ట బుక్‌హౌస్) - కూర చిదంబరం**

## తొలి ప్రయత్నంలోనే ప్రౌఢ కవిత్వం

వర్ధిష్ణువుడైన యువకవి శ్రీవశిష్ఠ సోమేపల్లి తన తొలి కవితా సంపుటిని 'ఆకురాలిన చప్పుడు'గా సంభావిస్తున్నాడు. 'దేశం కాలికి పుండు పడింది/ నడిచీ, నడిచీ పుండు పడింది/ దేశం గూటికోసం ఇంకా నడుస్తోంది/ నెత్తిన తరాల బీదరికాన్నీ/ చంకన మరో తరం ఆకలినీ మోసుకెళ్తోంది' కరోనా



నేపథ్యంలో వలస కార్మికుల వ్యధను యింత హృద్యంగా వినిపించిన కవి మరొకరు బహుశా లేరేమో! ఈ కవిది బలమైన గొంతుక..వ్యక్తీకరణలో వైవిధ్యం, వ్యంగ్యం పుష్కలంగా తొణికిసలాడుతుంది. 'అప్పుడప్పుడు ఏడవాలి/ కొద్దిగా బరువుల్ని జార్చుకోడానికే కాదు/ జ్ఞాపకాల్ని ఇంకొంచెం మోయడానికి/ జీవితాన్ని ఇంకొంత కొలవడానికి/ కొన్ని విత్తనాల్ని దుఃఖంతో నాటడానికి' అంటున్న ఈ కవి జీవితాన్ని ఎంతలోతుగా దర్శిస్తున్నాడో అర్థమవుతుంది. ఆగ్రహంతో కూడిన ఆర్ద్రత ప్రతి కవితలోను చిప్పిరిల్లుతుంది. యింతటి సంక్షోభంలో వశిష్ఠ కవిత్వం ఎందుకు రాస్తున్నాడు? 'ఓ చప్పుడు కోసం/ నగర ఘోషను వినబడనివ్వని ఓ మాట చప్పుడు కోసం' అలికిడి కోసం, చైతన్యం కోసం, కదలిక కోసం ఆకురాలిన చప్పుడులా ధ్వనిస్తున్నాడు. 'వెలితి నిండిన గుండెలో..ఏదో ఆకురాలిన చప్పుడు వినిపిస్తుంది' అన్న ఆశావహ దృక్పథంతో కవన ప్రస్థానం సాగిస్తున్నాడు శ్రీవశిష్ఠ. **(ఆకురాలిన చప్పుడు, రచన: శ్రీవశిష్ఠ సోమేపల్లి, వెల: రూ 120, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో) - రమణ వెలమకన్ని**



# ఊహాల పల్లకి

మీ వాకిట నిలుచుండి నీ దర్శనమునకై,
నీ క్రీగంటి ఓర చూపునకై,
పరితపిస్తున్న ప్రేమ పిపాసిని, నేను!
నీ యందు నాకున్న అవ్యాజమైన
అనురాగం, నిజం నిజం!
నీతో కొత్త జీవితాన్ని
పంచుకుని, కొత్త లోకాల
రమణీయ ప్రకృతిలో ఓలలాడవలెనని,

ముమ్మాటికి! కలలు కంటున్నవాణ్ణి!
కమ్మని కలలు సాకారం కావాలని,
ఉవ్విళ్లూరుతున్నవాణ్ణి.
మన ఇరు పెద్దల మెప్పించి, ఒప్పించి
వారి ఆశీర్వాద బలంతో,
మనిద్దరం ఏకమై.. మమేకమై వుందాం.
సమానతా మానవతా మనుగడలకు,
ముందడుగులు వేస్తూ, ఆదర్శ జంటగ
కలకాలం నిలచివుందాం
ఓ చెలీ! నెచ్చెలీ!

**నీవు** సహజంగా కరుణరసార్ద్ర మూర్తివి
ప్రేమైక స్వరూపిణివి.
అనురాగ దేవతవు నీవు.

**- ఏ.వి.వి.ప్రసాద్ శర్మ**

# భావతరంగాలు

## ఈవారం కవిత్వం

యంత్ర తంత్ర వినోదం
మనిషికీ మనిషికీ మధ్య విభేదం
కుల మతాంతర్గత దౌష్ట్యాలు
సమసమాజ విహీన
కారక హేతువులు.
కులమతాలు
కార్చిచ్చె ప్రగతిని
వైపరీత్యంతో
విధ్వంసం గావించినా
మనోక్షోభ.. నిలువెల్లా మనిషిని దహించినా
ఏటికెదురీది మనిషి పయనించలేడు!
సహనం కోల్పోయి నిస్పృహతో
జీవనం సాగించలేడు.
ఏరు దాటాక తెప్ప తగలేసే మనిషితో
సహజీవనం చేయలేడు.
సహనానికి సరిహద్దు కొంచెమే.
అయినా-/ముప్పు పొంచివున్నా..
కర్కశత్వం కనిపిస్తున్నా
అతి సౌజన్యం మనిషికి ముప్పే.
అలా కాక-
మనిషిలో గోచరమయ్యే
విశృంఖల విహాయస వికృత విలయం తప్పే.
సంయమనమే మరి సుఖం.

**- యలమంచిలి శివాజీ**

# ఏదో వినిపించని రాగం

గదిలో దీపం మదిలో/ మౌనం
ఏ రోదసి నక్షత్రాల మౌనమో/ ఏ గాంధర్వ గానం మూగవోయిన
క్షణమో/ అంతా ఏకాంత వలయంలో
ఓ నిశ్శబ్దం/ ఎక్కడి కలనో కదలదు మెదలదు
మాయ లాంటి మైకంలో/ వేళకాని వేళ ఏమిటో
వింతగ ఈ రేయి.. అదేమిటో!
దిగాంతాల కాటుక రేఖ/ అలల తెరలపై ఓ ఛాయా చిత్రం
ఆవహించి నిశ్శబ్దంలోకి/ మూగవోయిన ఓ విపంచి
కదిలేది ఏ క్షణమో
వినిపించేది ఏ రాగమో!

**- రవి మాగంటి**



## కుటుంబ జీవనం..

(9వ పేజీ తరువాయి)

అనుబంధాలుగా బలపడకపోవటమే ప్రధాన కారణం.

సమాజం బాగుపడాలంటే ప్రేమ పునాదిగా ఉండే బంధాలు, బాంధవ్యాలు ఎంతో అవసరం. సహజ స్వేచ్ఛ, శ్రేయస్సు ఈ ప్రేమపైనే ఆధారపడి బలపడతాయి. ఆ పునాది ఇంటి నుండే ఏర్పడుతుంది. తల్లిదండ్రులకి, పిల్లలకి ఉన్న సంబంధాలు మానవ సంబంధాలుగా మారి అనంతమూ, అభేద్యమూ అయినపుడే మిగిలిన బంధాలన్నీ బతికే కాలం పోయింది. కానీ గుండెల్లో 'మన' అనే భావన బలంగా ముద్రించుకుంటేనే బంధాలు బతికుంటాయి.

➤ మెసేజ్‌ల పలకరింపులకే రక్త సంబంధాల్ని పరిమితం చెయ్యకండి. తరచు కలుసుకోవడం, ఆప్యాయంగా పలకరించుకోవడంలోనే ఉమ్మడితనపు నిండుదనం దాగుంటుంది.

➤ వావి వరుసలతో కమ్మని పలకరింపులు పిల్లలకు నేర్పండి. అవే సాన్నిహిత్యాన్ని పెంచుతాయి. అన్నయ్య,



### కొసమెరుపు:

కొత్త కోడలు అంజలిని తీసుకుని గుడికి వచ్చింది అన్నపూర్ణ "పూజారిగారూ! బావున్నారా?" అని పలకరించింది.

"ఇవ్వాళ మా కోడలు పుట్టినరోజు. అర్చన చేయించండి" అని గోత్రనామాలు చెప్పింది.

"అత్తయ్యా! నా బర్త్‌డే వచ్చే నెల కదా!" అంది అంజలి.

"అవును. కానీ తిథుల ప్రకారం ఇవ్వాళ వచ్చింది. ఈరోజు గురుపౌర్ణమి. మంచిరోజు అంది. పూజ ముగిసాక తమతో తెచ్చిన ప్రసాదాలు చిన్న కప్పుల్లో పెట్టి అక్కడున్న వాళ్లందరికీ కోడలితో ఇప్పించింది. తర్వాత గుడి బయటకు వచ్చి అంజలిని "చిల్లర ఉందా?" అడిగింది.

"లేదు, గూగుల్ పే, ఫోన్ పే ఎంత కావాలి?" అని అంజలి ఫోన్ తియ్యబోతుంటే "వద్దు" అని అన్నపూర్ణ పది రూపాయల నోట్లు తీసి కోడలికిచ్చి అక్కడున్న భిక్షగాళ్లకి ప్రసాదంతో పాటు ఇప్పించింది.

ఓ పండు ముసలమ్మ "కోడలా తల్లీ! బంగారుబొమ్మలా ఉంది. సల్లగుండు తల్లీ" అంది. మరొకతను ప్రసాదం, పది రూపాయలు తీసుకొని "దీర్ఘాయుష్మాన్‌భవ, పండంటి బిడ్డను కను తల్లీ" అన్నాడు.

అలా అక్కడున్న వాళ్లంతా అన్నపూర్ణమ్మను గుర్తుబట్టి పలకరిస్తూ ఆశీర్వదించారు. బర్త్‌డే అంటే కొత్తబట్టలేసుకోవడం, కేక్ కట్ చెయ్యడం, ఇంట్లోనో, బయటో గెట్ టుగెదర్ పార్టీ అని మాత్రమే తెల్సిన అంజలికి కొత్త ప్రపంచాన్ని చూసినట్టు అనిపించింది. చేతిలో మిగిలిన పది రూపాయల నోట్లు అత్తగారికిస్తూ "మీ దగ్గర ఇంత చిల్లర...?" అంది ఆశ్చర్యంగా.

"ఎప్పుడు బ్యాంకుకు వెళ్లినా తెచ్చుకుంటాను. బ్యాంకు బ్యాలెన్సు, చేతిలో సెల్‌ఫోను, గూగుల్‌పే మొదలైనవి ఉంటే చాలు అని ఈ తరం అనుకుంటున్నందువల్లే మానవ సంబంధాలు అంతరించి పోతున్నాయి. ఆఖరుకి ధర్మం చెయ్యటానికి కూడా 'గూగుల్‌పే' వాడితే చిన్న చిన్న ఆనందాలు, మొహాల్లో హావభావాలు కనుమరుగైపోయి రోబో యంత్రాలా మారిపోతాం" అంది అన్నపూర్ణ. ఆ మాట అంజలిలో పని చెయ్యటం ప్రారంభించింది.

ఏటిలోని కెరటాల్లాంటివి. మనం 'ఈగో' అడ్డుగోడలు కట్టుకుంటే స్పర్థలు వస్తాయి. అవి ఎప్పటికప్పుడు తామరాకు మీద నీటిబొట్టులా జారిపోవాలి. పంతాలు, పట్టింపులు కాదు.. మానవ సంబంధాలు ముఖ్యం.

### జగమంత కుటుంబం

స్వచ్ఛమైన ఆలోచనలున్నవారికి జగమంతా కుటుంబమే.

ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టా తదితరాలిప్పుడు ఖండాంతర వ్యక్తుల్ని బంధువులుగా మారుస్తోంది. ఆపదల్లో ఉన్నవారు ఫోన్లో చిన్న మెసేజ్ పెడితే చాలు.. రక్తదానం, అన్నదానం, ఆర్థిక సాయం ఇలా.. ఎన్నో విధాలుగా యువత చేయూతనిస్తున్నారు.

"మేమున్నామంటూ.." సోషల్ మీడియా ద్వారా మానవత్వాన్ని చాటిచెబుతూ కొత్తరకపు మానవ సంబంధాలకు పునాది వేస్తున్నారు.

"మానవ జాతిని పట్టి పీడిస్తున్న అన్ని రుగ్మతలకే దివ్యౌషధం ప్రేమే. ఆ ప్రేమ ద్వారానే బంధాలు బలపడతాయి. అవే మానవ సంబంధాలుగా మారి సహజ ప్రగతికి దోహదపడతాయి" అంటారు స్వామి వివేకానంద. ❑

బలపడతాయి.

### ఆరోగ్యకరమైన మానవ సంబంధాల కోసం..

➤ మంచి మాట మనుషుల్ని, మనసుల్ని దగ్గర చేస్తుంది. ద్వేషం మానవ సంబంధాల్ని దూరం చేస్తుంది. ప్రేమ రక్త సంబంధాల్ని కలుపుతుంది. ఆ విలువ కుటుంబమే మనకు చెబుతుంది.

➤ రక్త సంబంధీకులు ఒకే చూరు కింద

అక్కయ్య పిలుపుల్లో ఉండే మాధుర్యం 'బ్రో..సిస్.' ల స్థాయికి దిగజార్చకండి.

➤ ఔనన్నా, కాదన్నా మావన సంబంధాలు



కథ

# స్నేహానికి చెయ్యిచాచు

అటు అయ్యవారిపేట, ఇటు టేకులపేట రెండు పేటలు కలిసే ఉంటాయి. కానీ ఆ రెండు పేటల మధ్యలో ఓ చిన్నచెరువు ఉంది. ఆ చెరువు ఒడ్డున టేకులపేట వైపు ఓ టేకు చెట్టు, అయ్యవారిపేట వైపు ఆముదం చెట్టు ఉన్నాయి. ఆ చెట్టుమీద కాకులు గూడులు కట్టుకొని జీవిస్తున్నాయి.



అయ్యవారిపేటలోని కుక్కలు, టేకులపేటని కుక్కలకు పడవు. ఆ కుక్కలు ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం చేస్తుంటాయి. కరుసుకోవడం, అరుసుకోవడం వాటికి ప్రతిరోజు అలవాటు అయిపోయింది.

ఓ రోజు కాకి కుక్కతో మాట్లాడసాగింది. 'మిత్రమా ఏంటి నీకు ఒళ్లంతా గాయాలు? అవును రాత్రి మీ పేటలో ఏంటి అరుపులు!' అని అడిగింది.

'అదేరాత్రి అయ్యవారిపేట కుక్కలు మా టేకులపేటకు వచ్చాయి. అందుకే మేం అరిచాం, కరిచాం, ఆ అరవడం కరవడంలో నాకు కూడా గాయాలు అయ్యాయి' అని కుక్క చెప్పింది.

'అయ్యా ఎందుకు అరవడం కరవడం మిత్రమా!?' అని మళ్లీ అడిగింది కుక్కను కాకి.

'మరి కరవమా, అరవమా? మేం మొన్న అయ్యవారిపేట వెళితే మమ్మల్ని అక్కడ కుక్కలన్నీ కలిసి, మమ్మల్ని కరిచాయి, తరమాయి, నిన్నరాత్రి మా టేకులపేట ఆ అయ్యవారిపేట కుక్కలు వచ్చాయి. అందుకు బదులుగా మేం అరిచాం, కరిచాం, తరిమాము అంతే మిత్రమా ఏమీ లేదు' అని కుక్క చెప్పింది.

'అయ్యో అలా కయ్యానికి కాలు దువ్వతే ఎలా?' అని కాకి కావుకావు' అంది. అంతే ఎక్కడో ఉన్న కాకులన్నీ కాసేపట్లోనే టేకు చెట్టు దగ్గరకి చేరాయి.

'ఏమైంది ఏమైంది? నీకు ఏమైనా ఆపద వచ్చిందా?' అని కాకులన్నీ ముక్తకంఠంతో ఆ కాకిని అడిగాయి.

'అయ్యో నాకేమీ కాలేదు. ఈ కుక్క మిత్రునితో మాట్లాడుతున్నాను. ఈ కుక్కలు మనలా కలిసిమెలసి ఉండటం లేదు. ఈ పేటకుక్కలని, ఆ పేట కుక్కలని కయ్యానికి కాలు దువ్వతున్నాయి. అనవసరంగా అనర్థాలు కొనితెచ్చుకుంటున్నాయి. గొడవలు పెట్టుకుంటున్నాయి. దెబ్బలు తగిలించుకుంటున్నాయి. అనే నా బాధ ఆ బాధలోనే అలవాటులో పొరపాటుగా 'కావు కావు' అని అరిచాను' అంది ఆ కాకి మిగతా కాకులతో.

'అదేంటి నువ్వ అలా పిలిచావో లేదో ఇలా మీ కాకులన్నీ నీ దగ్గర వచ్చి, వాలాయి ఏంటి?' అని ఆరా తీసింది కుక్క.

'మేం ఎప్పుడూ గొడవలు పెట్టుకోము, మాలో ఎవరికైనా, ఎప్పుడైనా, ఏదైనా ఆపద వస్తే అందరం కలిసి, మెలసి ఆపద నుండి బయటపడతాం. అవును మిత్రమా కలిసి ఉంటే కలదు సుఖం! కయ్యాటలు పెట్టుకుంటే కలదు కష్టం' అంది.

'అవును నువ్వ చెప్పింది నిజమే మేం చేసేది తప్పే, ఇకనుండి మీ కాకుల్లాగే మేం కుక్కలం చక్కగా కలసిమెలసి మసులుతాము, కయ్యానికి కాలు చాపం, స్నేహానికి చేయి చాస్తం, సరేనా' అంది తోక ఊపుతూ కుక్క.

'చాలాచాలా సంతోషం. ఇకనుండి ఈ పేటలో కుక్కల అరుపులు ఉండకూడదు. కలకాలం కలిసి, మెలసి హాయిగా ఆనందంగా ఉల్లాసంగా ఉత్తేజంగా ఉండండి' అని అక్కడి నుండి కాకి 'కావుకావు' అంటూ ఆకాశంలోకి ఎగిరిపోయింది.

ఆ రోజు నుండి అయ్యవారిపేటలో కానీ టేకులపేటలో కానీ కుక్కల అరుపులు లేనేలేవు. ఆ పేట ఉన్న ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు.

**- ఎ.వెంకట అమ్మిరాజు**

## బాలగేయం

### సంతోషం



పిల్లల్లారా రారండి
పిల్లిపిల్లల్ని చూడండి
ఎంత ముద్దొస్తున్నాయో!
చూసి సంతోషించండి
అక్కల్లారా రారండి
కుక్కపిల్లలు కనరండి
ఎంత ముచ్చటగున్నాయో!
మచ్చిక చేయరారండి
బుడతల్లారా రారండి
ఉడతలనే వీక్షించండి
ఎంత ఆనందంగున్నాయో!
ఆస్వాదించరారండి
చిన్నారులారా రారండి
చిలుకలనే తిలకించండి
పలుకులెంత
తియ్యగున్నాయో!
విని తరించగరారండి
పాపల్లారా రారండి
కోడెదూడను చూడండి
దానిదెంత ఉత్సాహమో!
చూసి నేర్వగరారండి

**- జి.నరేంద్రబాబు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎ.ప్రతిభ,** మన్నెంకొండ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బ్లాక్‌బోర్డు మీద చాక్‌పీస్‌తో రాసేటప్పుడు కీచుమనే శబ్దం ఎందుకు వస్తుంది?

**జవాబు: ప్రతిభ!** చాక్‌పీసును బోర్డుకు దాదాపు లంబంగా కానీ, పూర్తి లంబంగా కానీ పట్టుకుని రాసేటప్పుడు బ్లాక్‌బోర్డుకూ, చాక్‌పీస్‌కూ మధ్య ఘర్షణశక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల చాక్‌పీస్ జారిపోతూ కీచుమనే శబ్దం చేస్తుంది. అయితే చాక్‌పీస్‌ను బోర్డుకు లంబంగా కాక కొంచెం ఏటవాలుగా పట్టుకుని రాస్తే ఘర్షణశక్తి పెరిగి శబ్దం మాయమవుతుంది.

**- పి.భరణి,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బాల్‌పాయింట్ పెన్ రీఫిల్స్‌లో సిరా పోస్తే రాయవెందుకని?

**జవాబు: భరణి!** రెండు పెన్నుల నిర్మాణంలో తేడా ఉంది. వాటిల్లో వాడే సిరాలోనూ తేడా ఉంది. ఫౌంటెన్ పెన్నులో నీటితో తయారయ్యే పలుచని సిరా ఉంటుంది. గొట్టంలో నిల్వ ఉండి పాళీ ద్వారా బైటకు వస్తుంది. అయితే బాల్ పెన్నులోని సిరా మాత్రం కార్బనికాలతో తయారైన ద్రావణాలతో చేస్తారు. దీనిలో స్నిగ్ధత ఎక్కువ. ఇది నిలువ ఉంటుంది. సన్నని గొట్టంలో నిల్వ చేస్తారు. ఆ గొట్టానికి సన్నని లోహపు బిగించబడి ఉంటుంది. ఆ సన్నని గొట్టంలోనే లోహపు బాల్ ఉంటుంది. బాల్‌ను కాగితంపై పెట్టగానే గొట్టంలోని సిరా వస్తుంది. బాల్‌మొన రాస్తుంది. ఈ బాల్ చక్కగా తిరగడానికి సిరాలో లూబ్రికేషన్ గుణం ఉంటుంది. ఇటువంటి గొట్టంలో మామూలు సిరా పోస్తే ఆ ఇంక్ బాల్‌ను అంటుకొని త్వరగా ఎండిపోతుంది. ఇక బాల్ అటూ ఇటూ కదలదు. ఆ పరిస్థితిలో కాగితం మీద రాయలేరు. కనుకనే బాల్‌పెన్‌లో మామూలు సిరా పనికిరాదు.



# విదేశీ విద్యకు ఈ నైపుణ్యాలు

ఉన్నత చదువుల కోసం ఇతర దేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ఎంతో కష్టపడి చదివి ఫారిన్ వర్సిటీల్లో సీటు సంపాదిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత చాలా విషయాల్లో సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అప్పటివరకూ పెరిగిన వాతావరణం, పరిస్థితులు వేరు. అక్కడకి వెళ్లిన తర్వాత కనిపించేవి వేరు. అక్కడి జీవన, విద్యావిధానాలు, సంస్కృతి అన్నీ కొత్తగానే కనిపిస్తాయి. ఒకపక్క చదువుకుంటూనే పార్ట్‌టైమ్ ఉద్యోగమూ చేయాల్సి వస్తుంది. ఈ సమయంలో కుటుంబసభ్యుల మీద బెంగపెట్టుకోవడం, భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోవడం లాంటి సమస్యలూ ఎదురుకావచ్చు. కొన్ని నైపుణ్యాలను పెంచుకుంటే వీటి నుంచి త్వరగా బయటపడొచ్చు.

### పరిచయాలు పెంచుకోవడం

విదేశాల్లో చదువుకునే వారికి ఈ నైపుణ్యం తప్పనిసరి. స్థానిక వసతి, రవాణా, మార్కెట్లు, కరెన్సీ విషయాల్లో అవగాహన ఉండటం ఎంతో అవసరం. రోజువారీ పనులు సక్రమంగా సాగాలంటే ఈ విషయాలన్నీ తెలిసుండాలి. అందుకోసం ఇతరులతో పరిచయాలు పెంచుకోగలిగే నేర్పు ఉండాలి. అందరితో త్వరగా కలిసిపోగలిగితే చాలా విషయాలు తెలుస్తాయి. నలుగురితో కలిసిపోయే నేర్పు అనేది కొత్త పరిస్థితులు, వాతావరణానికి అలవాటు పడటానికి బాగా తోడ్పడుతుంది. అలాగే కోర్సులో భాగంగా వివిధ ఇంటర్న్‌షిప్‌లు, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, సెమినార్లు, గ్రూప్ ప్రాజెక్టుల్లో పనిచేయాల్సి వస్తుంది. వీటన్నింటి వల్లా నలుగురితో కలిసిమెలిసి పనిచేయగలగడం ఎంతో అవసరం. త్వరగా ఉద్యోగంలో స్థిరపడటానికి ఈ నైపుణ్యం ఎంతగానో తోడ్పడుతుంది.

### త్వరగా అలవాటు పడటం

వెళ్లిన దేశంలోని వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ, భాష, వంటకాలు..ఇలా అన్నీ కొత్తగానే ఉంటాయి. వీటన్నింటికి నెమ్మదిగా అలవాటు పడగలగాలి. అప్పటివరకు మనకు తెలిసిన, చిన్నతనం నుంచీ అలవాటు పడిన ప్రపంచం సహజంగానే సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ పరిధి దాటి బయటకు వెళ్లినప్పుడు కాస్త అసౌకర్యంగానే ఉంటుంది. ఇవన్నీ జీవితంలో మార్పు తీసుకొచ్చే అనుభవాలే. వీటిని అర్థం చేసుకుంటూ, అలవాటుపడుతూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నించాలి. అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటుపడగలిగితే ఏకాగ్రతతో చదవడానికి అవకాశం ఉంటుంది.



### నిర్వహణ సామర్థ్యం

ఒకేసారి ఎన్నో పనులు చేయాల్సిన అవసరం ఉంటుంది. తరగతులకు హాజరుకావాలి, అసైన్‌మెంట్లు సమర్పించాలి, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి. మరోపక్క పార్ట్‌టైమ్ ఉద్యోగమూ చేయాల్సి ఉంటుంది. చదవుకుంటూనే ఇవన్నీ చేయాలంటే నిర్వహణ సామర్థ్యం ఎంతో అవసరం. ఈ నైపుణ్యం లేకపోతే పనుల ప్రాధాన్యాలను గుర్తించలేక విపరీతమైన ఒత్తిడికి గురవుతారు. దాంతో అనారోగ్య సమస్యలూ తలెత్తుతాయి. సమయపాలన, అంచనా వేయగలిగే సామర్థ్యంతో పనులన్నింటినీ ప్రణాళికబద్ధంగా పూర్తిచేయొచ్చు. అలాగే వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఖర్చులను అదుపులో ఉంచుకుంటే కొత్తచోట ఇబ్బందిపడాల్సిన అవసరం ఉండదు. సొంతంగా వండుకోవడం, ప్రజారవాణా సదుపాయాలను వినియోగించడం, నలుగురిలో కలిసి బయటకు వెళ్లడం వల్ల ఖర్చులను చాలావరకు నియంత్రణలో పెట్టుకోవచ్చు.

### పరిశోధనాశక్తి

విదేశీ యూనివర్సిటీలన్నీ తమ విద్యానాణ్యతను పెంచుకోవడానికే ప్రయత్నిస్తాయి. వివిధ అంశాల బోధనకు అవసరమైన వాతావరణాన్ని నెలకొల్పుతాయి. ఈ విద్యలో పరిశోధన కూడా అంతర్లీనంగా ఉంటుంది.





తమ పరిజ్ఞానాన్ని, తార్కిక ఆలోచనా నైపుణ్యాన్నీ పెంచుకునే అవకాశాలు విద్యార్థులకు విస్తృతంగా ఉంటాయి. కాబట్టి ప్రత్యేకాసక్తి ఉన్న సబ్జెక్టుని ఎంచుకుని దాంట్లో పరిశోధనలు చేసే నైపుణ్యాన్ని పెంచుకోవాలి. అలాగే లెక్చరర్లు ప్రతి నిమిషం మీ వెన్నంటే ఉండరు. తరగతిలో లెక్చరర్లు బోధించే సమయం వారానికి కొన్ని గంటలపాటు పరిమితంగానే ఉంటుంది. కానీ ఆ తర్వాత నేర్చుకోవడం, అవసరమైన



సమాచారాన్ని సేకరించగలగడం లాంటివన్నీ సొంతంగానే చేయగలగాలి.

## స్వీయ అవగాహన

ఈ నైపుణ్యం లేకపోతే మీ విషయంలో మీరే ఒక అవగాహనకు రావడం కష్టమవుతుంది. విద్యార్థిగా మీ బలాలు, బలహీనతలను స్పష్టంగా గుర్తించ గలగాలి. అప్పుడే ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో తెలుసుకుని వాటిని మెరుగుపరచుకునే వీలుంటుంది. బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం, వాటికి ఎక్కువ సమయాన్ని కేటాయించడం లాంటివి చేయొచ్చు.

## భాషానైపుణ్యాలు

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఇంగ్లీష్ చక్కగా మాట్లాడి, రాసే నైపుణ్యం తప్పనిసరి. లెక్చర్లు అర్థం కావడానికీ, పరీక్షలు, అసైన్‌మెంట్లను సమర్థంగా పూర్తి చేయడానికీ ఆంగ్లభాషా నైపుణ్యం ఎంతో తోడ్పడుతుంది. దీంతోపాటుగా స్థానిక భాషను అర్థం చేసుకోవడం, మాట్లాడటానికీ ప్రయత్నిస్తే స్థానికులతోనూ త్వరగా కలిసిపోగలుగుతారు. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లినా భాషాపరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదు. పైగా కొత్త భాషను నేర్చుకోవడం అంటే మెదడుకు పదునుపెట్టినట్లే.

## తొలిప్రాధాన్యం

చదువు నిమిత్తం కుటుంబానికీ, స్నేహితులకూ దూరంగా ఇతర దేశాలకు వెళతారు. ఈ సమయంలో మీ దృష్టిని మళ్లించే అంశాలెన్నో ఎదురుకావచ్చు. కొత్త స్నేహితులు, అప్పటివరకూ చూడని కొత్త ప్రపంచం ఆకర్షణలో పడి చదువును ఏమాత్రం నిర్లక్ష్యంచేయకూడదు. ప్రతి లెక్చరుకూ హాజరుకావడం, సకాలంలో అసైన్‌మెంట్లు పూర్తిచేయడం, ఇవన్నీ మంచి విద్యార్థిగా మీరు చేయాల్సిన పనులు. మొదటి ప్రాధాన్యం ఎప్పుడూ చదువు కావాలి. ఆ తర్వాతే మిగిలినవన్నీ.

ఈ విషయాలన్నీ గుర్తించుకుంటే విదేశీ విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తిచేయగలుగుతారు. ❑


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# ఓ అమ్మ విజయం

కథ

సుమ కైకాల

మాధవ్ చేయి పట్టుకుని కోటి ఆశలతో కాకపోయినా గుండె నిండా కొత్త జీవితంపై మధురమైన ఊహాలతో అతనింట్లో కృష్ణవేణి కుడికాలు మోపింది. స్వాగతించి హారతిచ్చేందుకు అక్కడ ఎవరూ లేరు. అయినా ఇక నుండి తను ఉండబోయే పొదరిల్లు ఇదే అని చుట్టూ పరికించి చూసింది.


ఇంట్లో ఇల్లాలు లేని ఇల్లు ఎలా ఉంటుందో ఆ ఇల్లు అలాగే ఉంది. ఏది ఎక్కడ ఉండాలో అక్కడ లేదు. మరీ చిందరవందరగా లేకపోయినా అస్తవ్యస్థంగానే ఉంది. నాలుగు రూములు, ముందు హాలు, బయట ఖాళీ జాగా. ఏదీ కృష్ణవేణికి క్రమపద్ధతిలో అగుపించడం లేదు. ఎప్పుడెప్పుడు నడుం బిగించి రంగంలోకి దిగుదామా అని ఆలోచిస్తోంది.

అది పసిగట్టిన మాధవ్ హాలులో సోఫా చూపించి "కాసేపు ఇక్కడ కూర్చో, ఇప్పుడే వస్తాను" అంటూ బెడ్రూమ్‌లోకి వెళ్లాడు.

అతడెందుకు వెళ్లాడో కృష్ణవేణికి అర్థమయింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధపడినా ఎందుకో చెమటలు పట్టాయి. చేతిలోని కర్చీఫ్‌తో తుడుచుకుంటుండగా మువ్వల శబ్దం వినిపించి అటు చూసింది.

మాధవ్ చేయి పట్టుకని పది సంవత్సరాల పాప చేతిలో ఒక గులాబీతో నడిచి వచ్చింది.

పింక్ కలర్ గౌను వేసుకుని బొద్దుగా, ముద్దుగా అచ్చు మాధవ్ పోలికలతో, వేసుకున్న గౌను రంగుతో పోటీ పడుతున్న మేని రంగుతో చాలా అందంగా ఉంది పాప. వత్తుగా ఉంగరాల జుట్టు ముఖం మీద పడుతుంటే మరో చేత్తో వెనక్కి తోసుకుంటూ చేతిలో గులాబి కృష్ణవేణి చేతికిచ్చి "హాలో" అంది.



కృష్ణవేణి "థాంక్స్ పాపా" అంటూ పాపను దగ్గరకు తీసుకోవడానికి చేతులు చాపబోయింది.

అది గమనించిన పాప దూరం జరిగి తండ్రి కాళ్లను చుట్టుకుంది.

కాస్త బాధనిపించినా కొత్త కదా! అని మనసుకి సర్దిచెప్పుకుని "నీ పేరేంటమ్మా?" అని దగ్గరకు వెళ్లింది.

పాప సమాధానం చెప్పకుండా నిశ్శబ్దంగా రూములోకి వెళ్లిపోయింది.

"పాప పేరు హాసిని, ముద్దుగా పింకీ అని పిలుస్తాం. నువ్వు బాధపడకు. అలవాటయ్యేదాకా నీకు కష్టంగా అనిపిస్తుంది. అయినా నా కోసం భరించక తప్పదు కృష్ణా" అన్నాడు మాధవ్.

"ఇదంతా నాకు తెలియదా? మీరు మనసు పాడు చేసుకోవద్దు" అని కృష్ణవేణి వంటింటి వైపు నడిచింది.

"నువ్వు హైరానాపడి వంట చేయవద్దు. ఈరోజు బయట నుండి తెస్తాను" అన్నాడు మాధవ్.

వంటింటి పరిస్థితి చూసాక అదే కరెక్టనిపించి "సరేనని" సర్దే పనిలో పడింది కృష్ణవేణి.

రోజులు గడస్తున్నాయి. కృష్ణవేణి ఎంత ప్రయత్నించినా పింకీ చేరువ కావడంలేదు.

అంతా మాధవ్ గమనిస్తూనే వున్నాడు. ఒకటి రెండు సార్లు పింకీకి సర్దిచెప్పబోతున్న మాధవ్‌ని కృష్ణవేణి వారించింది. "మీరు అలా చేయడం వల్ల నన్ను వెనకేసుకు వస్తున్నారని నా పట్ల మరింత అయిష్టం పెంచుకుంటుంది. తన స్థానంలో ఉండి ఆలోచించండి. ఇప్పటివరకు తన ప్రపంచంలో మీరు మాత్రమే ఉన్నారు. మిమ్మల్ని నేను నా వైపుకి తిప్పుకుంటున్నాను.. అనే భావన తనలో ఉండి ఉంటుంది.

నన్ను అమ్మగా అంగీకరించే క్షణం వరకు తను అలాగే ఉంటుంది. నేను అప్పటివరకు వెయిట్ చేస్తాను. మీరు నన్ను అపార్థం చేసుకోకుండా సహకరించండి చాలు. ఈ విషయం పూర్తిగా నాకు వదిలెయ్యండి" అని చెప్పింది కృష్ణవేణి.

"థాంక్స్ కృష్ణా. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిని ఇక్కడకు వచ్చావు. నీకు ప్రశాంతతను ఇవ్వకపోగా మనసు నొచ్చుకుని పారిపోయే పరిస్థితులు ఏర్పడకూడదనే నా భయం. అందుకే ఇంత సమయం తీసుకున్నాను, నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించడానికి".

"మీరు అలా మాట్లాడవద్దు. ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొన్నదాన్ని. అన్నీ ఆలోచించుకున్నాకే మనం ఒకటయ్యాం. ఒక నిజం చెప్పనా? నాకు మీ భార్యగా కన్నా పింకితో అమ్మా అని పిలుపించుకోవడంలోనే ఎక్కువ ఆనందం ఉందనిపిస్తుంది.." నవ్వేసింది కృష్ణవేణి.

ఆ నవ్వులో ఆమె మంచితనం స్పష్టంగా గోచరించింది అతనికి. వారిరువురి కళ్లముందు గతం కదలాడింది.

...

కృష్ణవేణి తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి చిరుద్యోగి. భార్య పోయాక మళ్లీ వివాహం చేసుకోకుండా అల్లారుముద్దుగా ఉన్న దాంట్లోనే లోటు లేకుండా కూతురిని పెంచుకున్నాడు.

కృష్ణవేణి డిగ్రీ పూర్తవగానే ఒకరోజు పెళ్లి సంబంధం తీసుకువచ్చాడు ఒక దూరపు బంధువు.

"అబ్బాయి వ్యాపారం చేస్తున్నాడు. అబ్బాయి తరువాత ఒక ఆడపిల్ల ఉంది. పెళ్లయిపోయింది. డబ్బుకి లోటులేదు. అత్తమామలు మంచివారు. ఇంతకన్నా కావలసింది ఏముంది? అబ్బాయి ఫొటో తెచ్చాను. మీకు నచ్చితే ముందుకు వెళ్దాం" అన్నాడు.

ఇదంతా కృష్ణవేణికి, ఆమె తండ్రికి ఎంతో ఆనందంగా, ఎదురు చూడని పెన్నిధిలా అనిపించింది.

అబ్బాయి తండ్రి న్యాయవాది. తల్లి ఇంటిపనులు చూసుకునే గృహిణి, మంచి కుటుంబం. అబ్బాయి బాగానే ఉన్నాడు. బరువు బాధ్యతలు లేవు. అభ్యంతరం చెప్పడానికి ఏమీ లేకపోవడంతో కృష్ణవేణి తండ్రి "అమ్మా! నువ్వేమంటావు?" అన్నాడు కూతురితో.

ఆమె నవ్వుతూ తన అంగీకారం తెలిపింది. అంతకన్నా ఆలోచించే వయసు ఆమెకు లేదు.

కృష్ణవేణి పెళ్లితంతు ముగిసి ఆనందంగా అత్తగారింట్లోకి అడుగు పెట్టింది. పెద్ద కుటుంబంలోకి వచ్చానన్న ఆనందం ఆమెను నిలువనీయడం లేదు. వైవాహిక జీవితం గురించిన ఆమె కలలు మొదటి రాత్రే కల్లలయ్యాయి. శోభనం పెళ్లికూతురు మధురమైన ఊహాలతో బెడ్రూంలో భర్త రాకకై ఎదురు చూస్తూనే నిద్రపోయింది. అర్ధరాత్రివేళ తప్పతాగి మాట్లాడే పరిస్థితిలో కూడా లేని రాజేష్‌ని చూసి కృష్ణవేణి నిర్ఘాంతపోయింది.

మర్నాడు అత్తమామలు "అన్నీ సర్దుకుంటాయి, నువ్వు మా ఇంటి మహాలక్ష్మివి. కంగారు పడకు" అని ధైర్యం చెప్పారు.

కానీ అది జరగలేదు. రాజేష్ కృష్ణవేణితో ప్రత్యేకించి మాట్లాడడు. రోజూ తాగి రావడం, పలకరిస్తే తిట్టడం, అదేమిటని నిలదీస్తే కొట్టడం.

వారాలు, నెలలు గడుస్తున్నా ఈ పరిస్థితిలో మార్పు లేదు.

చిన్న వయసు, ఎన్నో బాధలు, ఏదైనా చెప్పుకుందామన్నా అమ్మలేదు. తోడబుట్టినవాళ్లు లేరు. పోనీ నాన్నకు చెప్పుకుందామా అంటే అప్పటికే ఆయన అనారోగ్యం బారిన పడ్డాడు. మరికొన్ని నెలలలో మరణించాడు. ఈ పరిస్థితిల్లోనే కృష్ణవేణికి ఆడపిల్ల పుట్టి పురిటిలోనే చనిపోయింది.

కాలక్రమేణా "అత్తమామలు స్వతహాగా మంచివారే. అయినా కొడుక్కి చదువు ఒంటబట్టకపోవడం, చెడు సహవాసాలు, సకల దురలవాట్లు ఉండడంతో వివాహం చేస్తే మార్పు వస్తుంది ఈ పెళ్లి చేసారు" అని ఆలస్యంగా తెలుసుకుంది.

రాను రాను రాజేష్ బిజినెస్ పనులు, టూర్లు అంటూ ఇంటికి రావడం తగ్గించేసాడు. మానసికంగా ఆమె మరింత కుంగిపోతోంది. ఆమె గుండెకోత అక్కడితో ఆగలేదు. తాగిన మైకంలో డ్రైవ్ చేస్తున్న రాజేష్‌కి యాక్సిడెంట్ అయి అక్కడికక్కడే మరణించాడు.

ఆమెను చూసి అత్తామామలు పశ్చాత్తాపంతో కుమిలిపోయారు. ఆడపడుచు నిశ్చల చదువుతో పాటు ఆధునిక భావాలున్న యువతి. ఇంచుమించుగా కృష్ణవేణి తోటిదే. వదినకు జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకుంది.

"ఆలోచనలు మాని చదువుకో వదినా" అంటూ దూరవిద్యలో పిజికి కట్టించింది.

ముందుగా "వద్దు" అని తిరస్కరించిన కృష్ణవేణిని అత్తమామలు కూడా ప్రోత్సహించారు. అప్పుడు చదువు పట్ల ఆసక్తిని పునరుద్ధరించుకుంది కృష్ణవేణి.

నిశ్చల ఉదయం ఇంగ్లీషు క్లాసులకు, సాయంత్రం కంప్యూటర్ కోర్సులో శిక్షణకు కృష్ణవేణిని పంపించింది. క్లాసులకు వెళుతూ ప్రపంచాన్ని చూస్తున్న ఆమెలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

మాధవ్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ యజమాని నిశ్చల కూడా అక్కడే నేర్చుకోవడంతో కృష్ణవేణిని అక్కడే చేర్పించింది.

మాధవ్ మంచివాడు. సంస్కారం కలిగిన వ్యక్తి. కృష్ణవేణి పరిస్థితులు నిశ్చల ద్వారా తెలుసుకుని ఆమెను ప్రోత్సహించేవాడు. మంచి మాటలు చెప్పి ధైర్యం కలిగించేవాడు. ఆడపిల్లకు చదువు, ఉద్యోగం ఉంటే మానసికమైన అండ ఉండి భవిష్యత్తు సుగమంగా ఉంటుంది అని ఉత్సాహపరిచేవాడు.

క్రమంగా ఇద్దరి మధ్యా మంచి స్నేహం ఏర్పడింది. ఒకరి గురించి మరొకరికి అన్ని విషయాలు తెలిసాయి. పింకి చిన్న పిల్లప్పుడే మాధవ్ భార్య అనారోగ్యంతో కన్ను మూసింది. మరో వివాహం చేసుకుంటే వచ్చే అమ్మాయి పాపను ఎలా చూస్తుదోనని నిరాకరించాడు.

ఆడప్లిల పెరుగుతుంటే తల్లి అవసరం ఎంత ఉంటుందో అర్థం చేసుకుంటు న్నాడేగానీ పెళ్లికి సుముఖత చూపలేదు.

కృష్ణవేణి పరిచయం తరువాత అతనిలో పెళ్లిపట్ల మళ్లీ ఆలోచన చిగురించింది. పింకీకి తల్లిగా ఆమె న్యాయం చేయగలుగుతుందని అనిపించి నిశ్చలను సంప్రదించాడు.

"థాంక్స్ కృష్ణా. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిని ఇక్కడకు వచ్చావు. నీకు ప్రశాంతతను ఇవ్వకపోగా మనసు నొచ్చుకుని పారిపోయే పరిస్థితులు ఏర్పడకూడదనే నా భయం. అందుకే ఇంత సమయం తీసుకున్నాను, నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించడానికి" అన్నాడు మాధవ్.

నిశ్చల "వదినా! సార్ నాతో మాట్లాడారు. నీకు కొత్త జీవితం ప్రారంభించే అవకాశం వచ్చింది. సర్ ఇంటికి ఇల్లాలిగా ఆహ్వానిస్తున్నారు. అమ్మా నాన్నలు కూడా నీ జీవితం ఇలా మారినందుకు వాళ్లే కారణమని బాధపడుతున్నారు. అదీగాక వాళ్లు తమ స్వంత ఊరికి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నారు. సర్ లాంటి మంచి వ్యక్తి తోడును కాదనవద్దు" అని కృష్ణవేణిని పెళ్లికి ఒప్పించింది.

మాధవ్‌తో స్నేహం పెళ్లి ప్రతిపాదనగా మారుతుందని కృష్ణవేణి ఊహించలేదు. ముందుగా షాకయినా పింకీకి తల్లిగా మాధవ్ జీవితంలోకి అడుగు పెట్టడానికి అంగీకరించింది. తల్లి లేని పిల్లగా తను పడిన ఇబ్బందులు తెలుసు కాబట్టి పింకీని అర్థం చేసుకోవడం సానుకూలమవుతుందని ఆశించింది.

"డాడీ... డాడీ..." అన్న పింకీ పిలుపుతో కృష్ణవేణి, మాధవ్‌లు ఇద్దరూ గత జ్ఞాపకాల నుండి తేరుకున్నారు.

"ఈ జడ చూడండి.. ఎన్నిసార్లు వేసుకున్నా తిత్తులు తిత్తులుగా వస్తుంది" అని చేతిలో దువ్వెన మరో చేతిలో రిబ్బను పట్టుకుంది పింకీ.

"పింకీ! నేను వేస్తానుండు" అని కృష్ణవేణి దగ్గరకు వెళ్లింది.

"డాడీ! మీరు వేయండి నాకు స్కూలుకు టైమవుతోంది" అని తండ్రి దగ్గరకు వెళ్లింది పింకీ.

"అమ్మ వేస్తానంటోందిగా, వెళ్ల తల్లి" అన్నాడు మాధవ్.

"వద్దు" పెడసరంగా సమాధానమిచ్చింది.


"పింకీ" అంటున్న మాధవ్ వంక వారించినట్లుగా చూసింది కృష్ణవేణి.

మాధవ్ మాట్లాడకుండా పింకీకి జడ వేసాడు.

రోజులు అదే విధంగా గడుస్తున్నాయి. మాధవ్ పని మీద నాలుగు రోజులు ఊరు వెళ్లవలసి వచ్చింది. అప్పుడు పింకీకి వేసవి సెలవులు కావడం వల్ల ఇంటి పట్టునే ఉంది. ఆ సమయాన్ని పింకీతో సాన్నిహిత్యం పెంచుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణవేణి ఉవ్విళ్లూరింది.

"పింకీ! అన్నం తిందాం రామ్మా" అని పిలిచేది.

"నాకు ఆకలిగా లేదు" చెప్పి అక్కడినుండి వెళ్లిపోయేది పింకీ.



తనకోసం ఎంతసేపు ఎదురు చూసినా వచ్చేది కాదు. తన రూములోకెళ్లి పడుకోగానే పింకీ బయటకు వచ్చి అన్నం పెట్టుకుని తినేది.

"నీకు ఏ కూరంటే ఇష్టం? ఏం వండమంటావు పింకీ?" అనేది కృష్ణవేణి.

"ఏది వండినా సరే" అనేది పింకీ.

"సినిమాకు వెళ్దామా?"

"నేను రాను, బొమ్మలు వేసుకోవాలి" అనేది తల ఎత్తకుండానే.

"ఏదయినా పార్కుకి వెళ్లి సరదాగా తిరిగివద్దామా పింకీ!"

"డాడీ వచ్చాక వెళ్దాం" టీవీపై నుండి దృష్టి మరల్చకుండానే అనేది.

పింకీ ప్రతి రెండు గంటలకొకసారి వాళ్ల డాడీకి ఫోన్ చేసి "డాడీ! ఎప్పుడు వస్తున్నారు? నాకు బోర్‌గా ఉంది. త్వరగా రండి. నేను ఒక్కదాన్నే ఉండలేకపోతున్నాను" అని కంప్లెయింట్ చేసేది.

ఇదంతా చూస్తున్న కృష్ణవేణి మనసు చివుక్కుమనేది. ఒక్కోసారి విసుగ్గా కూడా అనిపించేది. కావాలని ఏదో ఒకటి కల్పించుకుని మాటలు కలిపినా "వద్దు, తెలియదు, అలాగే" అనే మాటలు తప్ప పింకీ నుండి వేరే సమాధానాలు వచ్చేవి కావు.

రోజులు అలాగే గడుస్తున్నాయి.

మాధవ్ నిస్సహాయంగా ఇద్దరినీ చూస్తుండేవాడు. ఆ పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పడం కష్టం.

ఒకసారి పింకీకి పరీక్షల సమయం. తనకి తెలుగు సరిగ్గా రాదు.

తన డౌట్స్ అన్నీ ఎప్పుడూ మాధవ్ క్లియర్ చేస్తుంటాడు.

ఆ రోజు మాధవ్‌కి ఇంట్లో వుండి చదువు చెప్పడం కుదరక "అమ్మతో చెప్పించుకొమ్మని" చెప్పి వెళ్లాడు.

పింకీ కృష్ణవేణిని అడగలేదు.

మాధవ్ కృష్ణవేణికి ఫోన్ చేసి "పింకీ అడగకపోయినా తెలుగుపాఠాలు చదివించు. రేపు తెలుగుపరీక్ష" అని చెప్పాడు. పింకీ ఎలా స్పందిస్తుందో తెలిసినా దగ్గరకు వెళ్లింది కృష్ణవేణి.

తెలుగు పుస్తకం చేతిలో పట్టుకుని దిగులుగా కూర్చుంది పింకీ.

"డాడీ నీకు తెలుగు చెప్పమన్నారమ్మా" అంటూ కృష్ణవేణి పుస్తకం తన చేతుల్లోకి తీసుకుంది.

"నాకు నువ్వేం చెప్పనక్కర్లేదు" అంటూ పుస్తకం లాగేసుకుంది.

కృష్ణవేణికి బాధ, చిరాకు రెండూ కలిగాయి.

"పింకీ! నన్ను అమ్మలా అనుకోవద్దు. ఒక ట్యూషన్ టీచర్‌లా భావించి పాఠాలు చెప్పించుకో. అనవసరమైన పంతంతో సమయం వృథా చేసుకోవద్దు. నీకు మార్కులు తక్కువ వస్తే నీ కన్నా నేనే ఎక్కువ బాధపడతాను" అంటూ లేచి వెళ్లపోబోయింది.

పింకీ ఏమనుకుందో..! లేచి వచ్చి పుస్తకం చేతికి ఇచ్చింది.

మొహమాటపడుతూనే నెమ్మదిగా తన సందేహాలన్నీ అడిగి తెలుసుకుంది. ఆ తరువాత పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయి. కృష్ణవేణి చాలా సంతోషించింది.

కానీ పింకీ నుండి 'థాంక్స్' అన్న చిన్న మాట కూడా లేకపోవడంతో తెలియకుండానే బాధ కలిగింది.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్,
డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080

పింకీ పుట్టినరోజు వచ్చింది. తన స్నేహితులందరినీ ఇంటికి ఆహ్వానించింది. మాధవ్ కేక్, చిప్స్, కూల్ డ్రింక్స్ తీసుకువచ్చాడు. కృష్ణవేణి బిర్యానీ, రెండు మూడు రకాల కూరలు, స్వీట్లు తయారు చేసింది. ఇద్దరూ కలిసి ఇల్లంతా చాలా అందంగా అలంకరించారు. కృష్ణవేణి పింకీని పుత్తడిబొమ్మలా ముస్తాబు చేసింది.

మాధవ్ ఇదంతా చూసి చాలా ఆనందించాడు. పిల్లలందరి మధ్యన సరదాగా కేక్ కటింగ్ అయిపోయింది.

ఉత్సాహంగా పిల్లలకు భోజనాలు వడ్డించింది కృష్ణవేణి.

మాధవ్ కూడా సహాయం చేశాడు.

పిల్లలు పింకీతో "మీ మమ్మీ వంటలు చాలా బాగా చేసారు. బిర్యానీ చాలా బాగుంది" అన్నారు.

పింకీ సమాధానం కోసం కృష్ణవేణి చెవులు రిక్కించింది.

"తను మా మమ్మీ కాదు" పింకీ కొట్టినట్లుగా అంది.

"మరి ఎవరు?" ఒక పాప అడిగింది.

పింకీ కళ్లెత్తి మాధవ్ వంక చూసి తల దించుకుంది.

అవమాన భారంతో మాధవ్ తల దించుకున్నాడు.

కృష్ణవేణి అదేమీ విననట్లుగా మౌనంగా అక్కడి నుండి లోపలికి వెళ్లిపోయింది.

వెనుకే వచ్చి సర్దిచెప్పబోయిన మాధవ్‌తో "చిన్న పిల్ల కదా! తనే అర్థం చేసుకుంటుంది, నేను బాధపడను. మీరు మామూలుగా ఉండండి" అని కృష్ణవేణి కాస్త తేరుకున్నాక నచ్చచెప్పింది.

రెండు రోజుల తరువాత రాత్రివేళ నిశ్చల నుండి మాధవ్‌కి ఫోన్ వచ్చింది "సర్! మేం అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాం. వచ్చే సోమవారం గృహప్రవేశం. మీరు, వదిన, పాపతో కలసి తప్పకుండా వరాలి. వదిన పెళ్లయి వెళ్లాక ఒక్కరోజు కూడా ఎక్కడికీ వెళ్లలేదు. మా ఇంట్లో రెండు రోజులు ఉంటుంది. ముందుగా పంపించండి" అని అంది.

"తప్పకుండా వస్తామమ్మా! ఫోన్ మీ వదినకిస్తాను, మాట్లాడు" అని ఫోన్ కృష్ణవేణికి ఇచ్చాడు.

"వదినా! ఎలా వున్నావు? ఫోన్లోనే తప్ప కలవడమే లేదు. రెండు రోజులు ముందుగా రావాల్సిందే!" అని గొడవ చేసింది నిశ్చల.

"పింకీకి పరీక్షలు వస్తున్నాయి, నేను వచ్చి ఉండడం కుదరదు. ఆయన, పాప ఇబ్బంది పడతారు, ఫంక్షన్ రోజుకి ముగ్గురం వస్తాం" అంది కృష్ణవేణి.

"వదినా! నువ్వు చెప్పినా వినవుగానీ ఉంటాను"అని ఫోన్ పెట్టేసింది.

మాధవ్ నిద్రపోతున్న పింకీని చూస్తూ "నిన్ను అమ్మగా అంగీకరించలేని పిల్ల కోసం ఎంతగా తపన పడుతున్నావు కృష్ణా! పింకీకి ఎలా నచ్చచెప్పాలో నాకు తెలియడడం లేదు" అన్నాడు.

"మీరు అలా అనకండి. నేను కూడా తల్లి లేకుండానే పెరిగాను. తన మనసులో వుండే అపోహలు తొలగించవలసిన బాధ్యత నా మీద ఉంది. మా నాన్న "నన్ను సరిగ్గా చూసే అమ్మాయి రాదేమోనని మరో వివాహం చేసుకోలేదు. తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడంటే తమ స్థానానికి ముప్పు వాటిల్లుతుందని పసి హృదయాలు ఎలా తల్లడిల్లుతాయో నాకు. తెలుసు. తోటి స్నేహితులు, ఇరుగు-పొరుగు మాటలు దానికి తోడవుతాయి. అందుకే పింకీ నా పట్ల అలా ప్రవర్తిస్తోంది. తను నన్ను

> "వదినా! ఎలా వున్నావు? ఫోన్లోనే తప్ప కలవడమే లేదు. ఫంక్షన్‌కి రెండు రోజులు ముందుగా రావాల్సిందే!" అని గొడవ చేసింది నిశ్చల.
> "పింకీకి పరీక్షలు వస్తున్నాయి, నేను వచ్చి ఉండడం కుదరదు. ఆయన, పాప ఇబ్బంది పడతారు, ఫంక్షన్ రోజుకి ముగ్గురం వస్తాం" అంది కృష్ణవేణి.

అమ్మగా స్వీకరించేవరకు నిరీక్షిస్తాను. నాకు మాత్రం తనే కూతురు. అందుకే మనకు వేరే పిల్లలు వద్దని మీకు ముందే చెప్పాను. నా బంగారు తల్లికి నేనే అమ్మను. తనే నా కూతురు!" ఆపేక్షగా పింకీ తల నిమురుతూ అంది కృష్ణవేణి.

"కృష్ణా! నీదెంత మంచి మనసు?" ఆమె చేయి మీద చేయి వేసాడు మాధవ్.

పింకీ నిద్రలో మెలకువ వచ్చి జరిగిన సంభాషణ అంతా విన్నది. కళ్లు తెరచి కృష్ణవేణి ముఖం చూసింది. అందంగా నవ్వి లేచి వచ్చి కృష్ణవేణి ఒళ్లో తల పెట్టుకుని ఆమె చేయి తనపై వేసుకుంది.

కృష్ణవేణికి "నీ ఓపిక ఫలించింది" అన్న ప్రశంస మాధవ్ కళ్లల్లో కనిపించింది.

కొండంత భారం దిగిపోయింది అనే భావంతో ఊపిరి తీసుకున్నాడు మాధవ్.

ఆశ నెరవేరిన సంతృప్తితో కృష్ణవేణి ముఖం వెలిగింది.

## జోక్స్ కార్నర్

**సుబ్బారావు:** "ఏంటండీ ఇది? ఏమి డాక్టర్ మీరు? మీ మీద కేసు పెట్టి ఈ హాస్పిటల్‌ని మూయిస్తాను.

**డాక్టర్:** అసలు ఏమైంది? కారణం చెప్పకుండా నా మీద ఇలా విమర్శలు చేస్తున్నారు?

**సుబ్బారావు:** పోయిన నెలలో నాకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసారు కదా, మరి మా ఆవిడ నెల తప్పింది. ఆపరేషన్ చేయడం రాకపోతే ఎందుకు చేసారు?

**డాక్టర్:** నేను ఆపరేషన్ చేసింది మీకు మాత్రమే, మీ ఆవిడకు కాదు.

...........

**ప్రసాద్:** అర్జంట్‌గా మిమ్మల్ని కలవాలి. నా ఆస్తి వీలునామా రాయించాలి.

**లాయర్:** అంత అర్జంట్ ఏమొచ్చింది? మీరు ఇంకా వృద్ధులు కాలేదు కదా!

**ప్రసాద్:** అది కాదండీ! వచ్చే వారం నేను దూర ప్రయాణం చెయ్యబోతున్నాను. ఈ మధ్య చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి కదా, అందుకని.

...........

**కస్టమర్:** హోటల్‌లో బిల్ కట్టకపోతే అంట్లు తోమిస్తారు కదా! మీరేమో మీ ఇంటికి రమ్మంటున్నారు? ఆశ్చర్యంగా ఉందే! ఎందుకని?

**ఓనర్:** ఇంటికి రమ్మనేది నీకు అతిథి మర్యాదలు చెయ్యడానికి కాదు. నువ్వు తోమాల్సింది హోటల్లోని అంట్లు కాదు, మా ఇంట్లోని అంట్లు.

**- ఎస్.కె.యాకుబ్ పాషా,** ఖమ్మం

# పిల్లల్లో మానసిక అలసట



ఓ ఇంట్లో ఓ చిన్నారి.. వయస్సు పదేళ్లుంటాయి. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటున్న అమ్మాయే. ఉన్నట్టుండి ఏమైందో తెలీదు.. చదువు మీద ఉత్సాహం తగ్గింది. పరీక్షల్లో మార్కులు తగ్గుతూ వచ్చాయి. అయితే చదువు తప్ప మిగిలిన ప్రవర్తనలో ఎలాంటి మార్పూ లేదు. అంతా బాగానే ఉంది. కానీ ఎప్పుడు చూసినా కడుపునొప్పి అంటుండేది. అమ్మాయి తల్లిదండ్రులకు ఏమీ అర్థం కాలేదు. మార్కులు తగ్గుతుండడం పట్ల, అమ్మాయి కడుపునొప్పికి కారణం ఏమిటని వారు ఆందోళన చెందారు. క్రమంగా మరికొన్ని మార్పులు కూడా తెలిసాయి. చాలా తేలికైన పనులను కూడా ఎంతో కష్టంతో చేస్తోంది. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా ఉన్న అమ్మాయిలో కోపం ఎక్కువవుతూ వచ్చింది. ఎప్పుడూ ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతోంది.

అప్పటివరకూ హుషారుగా ఉండేవారిలో నీరసం చోటు చేసుకోవడానికి కారణం ఏమిటా? అని డాక్టరు దగ్గరకు తీసుకెళ్తే- ఆయన ఆ అమ్మాయి మనసులో ఏర్పడిన మానసిక అలసటే తప్ప మరొకటి కాదని అన్నారు డాక్టరు. పెద్దవాళ్లయితే తమ మనసులో ఉన్న విషయాన్ని బయటకు చెప్పేస్తారు. వారికి మాట అందుకు ఉపయోగపడుతోంది. కానీ పిల్లల విషయానికి వస్తే వాళ్లలా చెప్పలేరు. వారికి తగినంత భాషా పటిమ ఉండదు. ఎలా చెప్పాలో తెలీదు.

ఇందుకు మొదటి గుర్తు..

చదువులో ఉత్సాహం తగ్గడం. అనంతరం పరీక్షల్లో మార్కులు తగ్గడం, ఆ మార్కులు చూసి తల్లిదండ్రులు వెంటపడి నస పెడుతూ తోచుకోనివ్వరు. ఇందువల్ల ఆ పిల్లల్లో సమస్య మరింత ఎక్కువవుతుంది.

చదువులో మార్కులు తక్కువవుతున్నప్పుడు అందుకు మరేమైనా కారణాలు ఉన్నాయేమోనని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అలా చూడకుంటే పిల్లలు ఏమవుతారో ఆలోచించాలి. ఇందువల్ల పిల్లలు తమలోని బాధను చెప్పడానికి జంకుతారు. సరిగ్గా చెప్పడం తెలీదు. వారి సమస్యను సరిగ్గా వ్యక్తపరచలేరు. ఇందువల్ల వారిలో మానసిక వేదన, శారీరక సమస్యలు ఒక్కొక్కటీ బయట పడతాయి.

దీనిని సరిగ్గా అర్థం చేసుకోకుండా మన పిల్లలకు ఏదో అయిందని కంగారుపడిపోయి వైద్యుడి దగ్గరకు తీసుకుపోయి వైద్య పరీక్షలు అవీ ఇవీ అంటూ హైరాన పడతారు. నిజానికి అది సరికాదు. మానసిక అలసటకు గురైన పిల్లలను ఏం చేస్తారో తెలుసా? స్కూలుకి వెళ్తున్నామని చెప్పి ఇంకెక్కడికో వెళ్లొస్తారు. మార్కులు తగ్గుతాయి. అంతేకాదు, ఇందువల్ల వారిలో ఒక విధమైన సంకుచితత్వం ఏర్పడుతుంది.

నూటికి 85,90 మార్కులు తెచ్చుకునే పిల్లలు పదిహేను మార్కులు పొందలేని స్థితి నెలకొంటుంది. పిల్లల మానసిక అలసటకు కారణమేమిటి..? వంశ పారంపర్య గుణాలు, పెద్దల జీవన విధానాలు, ఇరవై నాలుగ్గంటలూ చదవమని పోరు పెట్టడం, నస పెట్టడం, ఆలోచించుకోనివ్వక వెంటపడటం, పైగా ఉద్యోగాలకు వెళ్లే తల్లిదండ్రులైతే పిల్లలతో ఎక్కువసేపు గడపకపోవడం... ఇలాంటి వివిధ కారణాల వల్ల పిల్లల్లో లేనిపోని సమస్యలు తలెత్తుతుంటాయి. వారి ప్రవర్తనలోనూ తేడాలొస్తాయి.

కనుక తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకోవాలి. ఓ పిల్లాడో, పిల్లో ఒళ్లంతా నొప్పులని చెప్తే అది మానసిక అలసట కూడా కావచ్చని అర్థం చేసుకోవాలి. మానసిక వైద్యులైతే ఈ విషయన్ని నిశితంగా తెలుసుకోగలరు.

సరే, ఈ మానసిక అలసటకు మందులేవైనా ఉన్నాయా? అని అడిగితే ఉందనే చెప్పవచ్చు. అదేమిటంటే ప్రేమ. ముఖ్యమైనది ప్రేమ. పిల్లల పట్ల ప్రేమతో గడపడం, ప్రేమగా మాట్లాడటం, ప్రేమగా చూసుకోవడం. ఈ ప్రేమ అనేది తల్లిదండ్రుల మధ్య కూడా ఉండాలి. అప్పుడే కుటుంబంలో ఓ ప్రేమపూరిత వాతావరణం నెలకొంటుంది.

ఓ క్లాసులో ఓ మాస్టారు దిద్దిన జవాబు పత్రాలను విద్యార్థులను దగ్గరకు పిలిచి ఇస్తున్నారు. అయితే ఓ పిల్ల ఆ పేపరు తీసుకున్న మరుక్షణం ఏడ్వసాగింది. "ఎందుకు ఏడుస్తున్నావు? ఏమైంది? మార్కులు తక్కువ వచ్చాయా?" అని ఆమె దగ్గర నుంచి పేపరు తీసుకుని చూశారు. అయితే ఆ పిల్లకు ఎనభై అయిదు మార్కులు వచ్చాయి. "మార్కులు బాగానే వచ్చాయి కదా! ఎందుకు ఏడుస్తున్నావు మరి?" అని అడిగారు మాస్టారు.

"నేను నూటికి నూరు మార్కులు వస్తాయనుకున్నాను. నేను అనుకున్నదాని కన్నా ఈ 85 మార్కులు అనేవి తక్కువే కదండీ!" అని ఏడ్చిందా పిల్ల.

"సరే.. వెళ్లి కూర్చో" అంటూ మాస్టారు మిగిలిన విద్యార్థులకు జవాబుపత్రాలు ఇస్తూ వస్తున్నారు.

ఓ పిల్లాడు అందుకున్న తన జవాబుపత్రం చూసి ఒకటే నవ్వుతున్నాడు. "ఏమిటీ! హుషారుగా ఉన్నావు? అనుకున్న దానికన్నా నీకు ఎక్కువ మార్కులు వచ్చాయా?" అని అడిగారు మాస్టారు.

అప్పుడు ఆ విద్యార్థి "అది కాదండీ మాస్టారూ! నూటికి నాకు వచ్చినవి పదిహేనే!" అన్నాడు.

"దానికి నవ్వుతున్నావేంటి?" అని అడిగారు మాస్టారు.

"సార్! ఇన్ని మార్కులు వస్తాయని నేనస్సలు అనుకోలేదు. అందుకే నవ్వొస్తోంది" అన్నాడా విద్యార్థి.

ఏమనుకోవాలి ఈ పిల్లల తీరుకి.

**- యామిజాల జగదీశ్**

# రంగుల రాజధాని కఠ్మాండు లోయ

యాత్రా కథనం

షేక్ అబ్దుల్ వాకీం జాని

నేపాల్ దేశ రాజధాని ఖాట్మండు అత్యంత సుందర ప్రదేశం. 2015లో సంభవించిన భూకంపంలో ఈ నగరం సర్వనాశనమై కోలుకుంటోంది. ఇక్కడ జరిగిన తవ్వకాల ప్రకారం గతంలో చక్కటి నాగరికత వెలిసినట్లు ఆధారాలు లభించాయి.



దండోచైత్య సొరంగంలో బ్రహ్మి లిపిలో లిఖింపబడిన వాక్యాలున్న ఒక ఇటుక లభ్యమైంది. పురాతత్వం శాస్త్రవేత్తలు ఇది 2000 సంవత్సరాల పూర్వ కాలానికి చెందినదని అంచనా వేసారు.


ఈ ప్రాంతం కనీసం 130 ముఖ్యమైన స్మారక చిహ్నాలను కలిగి ఉంది. హిందువులు, బౌద్ధులకు అనేక తీర్థయాత్ర ప్రదేశాలు ఉన్నాయి. లోయలో ఏడు ప్రపంచ వారసత్వ ప్రదేశాలు ఉన్నాయి. చారిత్రాత్మకంగా, లోయ, పరిసర ప్రాంతాలను కలిపి నేపాల్ మండల సమాఖ్యగా ఏర్పడింది. ఖాట్మండు, లలిత్‌పూర్(పటాన్) అనే రెండు ఇతర రాజధానులు స్థాపించబడినప్పుడు 15వ శతాబ్దం వరకు, భక్తపూర్ దాని రాజధానిగా ఉంది. 1960 వరకు ఖాట్మండు లోయను నేపాలా లోయ, నేపా వ్యాలీ అని పిలిచేవారు. 1961లో ఖాట్మండు లోయను జిల్లాగా చేసారు. అప్పటి నుంచి దీనిని ఖాట్మండు వ్యాలీగా పిలుస్తున్నారు. నేపా వ్యాలీ అనే పదాన్ని ఇప్పటికీ నెవార్ ప్రజలతో పాటు స్థానిక ప్రభుత్వం ఉపయోగిస్తుంది. వృద్ధులు ఇప్పటికీ ఈ లోయను నేపాల్ అనే సూచిస్తారు.

స్వనిగ అనే నేపాల్ భాష పదం మూడు నగరాలు అని సూచిస్తుంది. అవి యెన్(ఖాట్మండు), యాల(లలిత్‌పూర్), కవాప(భక్తపూర్) సూచించడానికి ఉపయోగిస్తారు.

ఖాట్మండు, లలిత్‌పూర్, భక్తపూర్ ఈ మూడు పట్టణాలు చారిత్రకమైనవి. నేపాల్‌లోని ఖాట్మండులోయ అత్యధిక జనాభా కలిగి అభివృద్ధి చెందిన ప్రదేశం.

ఖాట్మండు లోయ 24 కి.మీ. పొడవు, 19 కి.మీ. వెడల్పును కలిగివుండి చుట్టూ ఆకుపచ్చని వృక్షాలు, గంభీరమైన సుందర పర్వతాలు నయనానందం చేయడంతో రంగుల రాజధానిగా విరజిల్లుతోంది. అధిక సంఖ్యలో కొన్ని ప్రధాన కార్యాలయాలు ఈ లోయలో ఉన్నాయి. ఇది నేపాల్ దేశం ఆర్థిక కేంద్రంగా మారింది. నేపాల్‌లో అత్యధిక సంఖ్యలో జాతరలు (వీధి ఉత్సవాలు) జరుగుతాయి. ఇక్కడి ప్రత్యేకమైన వాస్తుశిల్పం, గొప్ప సంస్కృతి, పర్యాటకుల సందర్శన వలన ప్రసిద్ధి చెందింది. బ్రిటిష్ చరిత్రకారులు ఈ లోయను 'నేపాల్ ప్రాపర్' అని పిలుస్తారు. పహారీ పేరు ఖాట్మండు దర్బార్ స్క్వేర్‌లోని ఒక నిర్మాణం నుండి వచ్చింది.

ఖాట్మండు నగరానికి ఆ పేరు కాష్ఠమండపం ఆలయం ద్వారా వచ్చింది. సంస్కృతంలో కాష్ఠ అనగా కొయ్య; మండప్ అనగా కప్పబడిన ప్రదేశం అని అర్థం. స్థానిక భాషలో దీనిని మారు సతాల్ అని కూడా పిలుస్తారు. దీని సంస్కృత పేరు కాష్ఠ మండప 'చెక్క ఆశ్రయం' అని పిలుస్తారు. విశిష్టమైన సత్తాల్ ఆలయాన్ని 1596లో రాజు లక్ష్మీ నరసింహా మల్లా నిర్మించాడు. ఎక్కడా ఇనుప మేకులు ఉపయోగించకుండా ఆలయ నిర్మాణమంతా పూర్తిగా చెక్కతోనే నిర్మించడం విశేషం.





రెండతస్తుల ఈ పగోడాకు ఉపయోగించిన కలప ఒకే చెట్టు నుండి లభించిందని ఇక్కడి చరిత్ర వల్ల తెలుస్తోంది. ఖాట్మండులోని చాలా చోట్ల బంగారు దేవాలయాలు, బుద్ధ విగ్రహాలు అత్యంత కళాత్మకంగా దర్శనమిస్తాయి.

## ఖాట్మండులో చూడదగిన ప్రదేశాలు:

### పశుపతినాథ్ ఆలయం

ఖాట్మండు తూర్పు అంచున పశుపతినాథ్ ఆలయం భాగమతి నది ఒడ్డున విస్తరించి ఉంది. భారతదేశం అంతటా ఉన్న పన్నెండు జ్యోతిర్లింగాలకు అధిపతిగా భావించే జ్యోతిర్లింగాన్ని కలిగి ఉన్న పశుపతినాథ్ ఆలయాన్ని తిలకించడానికి భారతదేశం నుండి కూడా శివభక్తులు వెళుతుంటారు. చుట్టుపక్కల ప్రాంతంలో దేవాలయాలు, ఆశ్రమాలు ఉన్నాయి.

యునెస్కో 1979లో పశుపతినాథ్ ఆలయాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. నేపాల్ దేశ రాజధాని ఖాట్మండు నగరం ఈశాన్య దిక్కు పొలిమేర్లలో భాగమతి నది ఒడ్డున ఉంది. పశుపతి(శివుడు) ప్రధాన దైవంగా ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అతి పవిత్రమైన శైవ దేవాలయంగా భావిస్తారు. భారతదేశం, నేపాల్ నుండి వచ్చిన భక్తులు ఈ దేవాలయాన్ని సందర్శిస్తారు.

మహాశివరాత్రి రోజు అత్యంత పర్వదినం కావడంతో వేల సంఖ్యలో భక్తులు పశుపతిని దర్శిస్తారు. ఈ దేవాలయంలోకి హిందువులు కానివారిని అనుమతించరు.

ఇక్కడి దేవాలయంలో ఉన్న మూలవిరాట్టుని నలుగురు అర్చకులు మాత్రమే స్పృశించే అధికారం ఉంది. శంకరాచార్యులు ప్రారంభించిన ఆలయ సంప్రదాయం ప్రకారం ఇక్కడి అర్చకులు దక్షిణ భారతదేశం నుండి నియమించబడతారు.

శంకరాచార్యులు ఇక్కడ జంతుబలిని నిషేధించారు. దక్షిణ భారతదేశం నుండి అర్చకులు ఇక్కడ పూజలు నిర్వహించడానికి ప్రధాన కారణం.. నేపాల్ రాజు మరణించినప్పుడు నేపాల్ దేశం సంతాప సముద్రంలో మునిగి వుంది. ఆ సమయంలో నేపాల్ ప్రజలకు పశుపతినాథ్ స్వామి నిత్య కైంకర్యాలు చేసే అవకాశం ఉండదు. పశుపతినాథ్‌కి నిత్య కైంకర్యాలు నిరంతరంగా కొనసాగాలనే కారణంచేత భారతదేశ అర్చకులు ఇక్కడ అర్చకత్వం నిర్వహించే సంప్రదాయం మొదలైంది.

### బౌద్ధనాథ్ స్థూపం

ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు ఇక్కడకు వస్తుంటారు. వారు ఆచార పద్ధతిలో 'కోరా' అని పిలువబడే పెద్ద గోపురం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. 1979 నుండి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా దీనిని గుర్తించింది.



బౌద్ధనాథ్ స్థూపం ప్రపంచంలో అత్యధికంగా సందర్శించే బౌద్ధ ప్రదేశాలలో ఒకటి. కశ్యప బుద్ధుని చితాభస్మం ఈ స్థూపంలో పూడ్చిపెట్టబడిందని నమ్ముతారు.

### నమో బుద్ధ స్థూపం

నమో బుద్ధ ఖాట్మండులోని అత్యంత ప్రసిద్ధ బౌద్ధ మత స్మారక కట్టడాలలో ఒకటి. బౌద్ధనాథ్ స్థూపం నుండ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ యాత్రా స్థలం సందర్శనకు ఆహ్లాదకరమైన ప్రదేశం. పచ్చ, మణి, రత్నాలతో కప్పబడిన పర్వతాలు, ఆటవిక సౌందర్యం, ఇక్కడి ప్రకృతి దృశ్యం పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.

### డ్రీమ్స్ గార్డెన్

ఖాట్మండులోని డ్రీమ్స్ గార్డెన్ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. దీన్ని స్వప్నబైగిచాను గార్డెన్ ఆఫ్ డ్రీమ్స్ అని కూడా పిలుస్తారు. రోజువారీ జీవితంలోని ఒత్తిళ్ల నుండి ప్రశాంతత పొందేందుకు అనునిత్యం పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. 1920లో నిర్మించిన ఈ తోటను చాలా అభివృద్ధి చేశారు. ఇక్కడ సుందర సరస్సులు, ఫౌంటెన్‌లు ఉన్నాయి. ఈ ప్రదేశం పిక్నిక్ స్పాట్‌గా ప్రసిద్ధి చెందింది.

### సిద్ధార్థ ఆర్ట్ గ్యాలరీ

ఇక్కడ నేపాలీ కళాఖండాలు తిలకించ వచ్చు. నేపాలీ కలల చరిత్రను తెలుసుకోవాలంటే ఈ సంగ్రహాలయాన్ని తప్పక చూడాల్సిందే. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కళాఖండాల గ్యాలరీ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది.

### థమెల్

ఖాట్మండు నగరంలో థమెల్ అనేది అత్యంత రద్దీగా ఉండే ప్రసిద్ధ వాణిజ్య కేంద్రాలలో ఒకటి. ఇక్కడ చారిత్రక కట్టడాలు, అద్భుతమైన దేవాలయాలు చూడవచ్చు.

పర్యాటకులకు కావలసిన అన్ని రకాల వస్తువులు వీధి అంగళ్లలో లభిస్తాయి. మంచి ఆహారం, దుస్తులు, పర్యాటకులు ఇష్టపడే అనేక వస్తువులు కొనుగోలు చేయవచ్చు.

## జగన్నాథ దేవాలయం

ఖాట్మండులోని ప్రసిద్ధ దేవాలయాలలో ఒకటి జగన్నాథ దేవాలయం. దాని నిర్మాణం, మతపరమైన ప్రాముఖ్యతకు అత్యంత ప్రసిద్ధి చెందింది. ఇక్కడి సున్నితమైన శృంగార శిల్పాలు పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తాయి. నగరంలోని పురాతన దేవాలయాలలో ఒకటి. ఇది 16వ శతాబ్దం ప్రారంభంలో మల్లా రాజవంశం రాజు మహేంద్ర పాలనలో దీన్ని నిర్మించారు. అంతర్నిర్మిత సాంప్రదాయ పగోడా శైలి నిర్మాణం ఎక్కువగా చెక్క ఇటుకలతో నిర్మించారు.

## తౌదాహా సరస్సు

ఖాట్మండు శివార్లలో ప్రసిద్ధి చెందిన మంచినీటి సరస్సు తౌదాహా. ఈ సరస్సు చుట్టూ దట్టమైన అడవులు, కొండలు ఉన్నాయి. సరస్సులో అనేక రకాల చేపలు ఉన్నాయి. అలాగే ఈ ప్రాంతంలో వలస పక్షులు వస్తుంటాయి. పక్షుల వీక్షణకు ఈ ప్రాంతం గొప్ప కేంద్రంగా విరాజిల్లుతుంది.

## దర్బార్ స్క్వేర్

ఖాట్మండు సంస్కృతి, చరిత్రను తెలుసుకోవాలంటే దర్బార్ స్క్వేర్‌ని సందర్శించవలసిందే. ఖాట్మండు దర్బార్ స్క్వేర్‌కు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా యునెస్కో గుర్తింపు లభించింది. హస్తకళాకారుల ప్రదర్శనలకు ఇది చాలా ప్రసిద్ధి చెందింది. ఇది ఖాట్మండులోని ఒకప్పటి రాజభవనం ఎదురుగా ఉంది. ఇక్కడ నెలకొని ఉన్న కుమారి చోక్ నేపాల్ అత్యంత ఆసక్తికరమైన ఆకర్షణలలో ఒకటి.



## కైసర్ గ్రంథాలయం

ఖాట్మండులోని కైసర్ మహల్‌లోని కైసర్ గ్రంథాలయంలో 45,000 పుస్తకాలు ఉన్నాయి. 1969లో స్థాపించిన ఈ లైబ్రరీలో చరిత్ర, చట్టం, కళ, మతం, తత్వశాస్త్రం వంటి విషయాలపై అనేక రకాల పుస్తకాలు ఉన్నాయి. ఒకప్పుడు ఈ గ్రంథాలయం ప్రసిద్ధ పర్యాటక ప్రదేశంగా విరాజిల్లింది. 2015లో సంభవించిన భూకంపం కారణంగా తీవ్రంగా దెబ్బతింది.

## లాంగ్టాంగ్ నేషనల్ పార్క్

ఇది నేపాల్‌లోని నాల్గవ పెద్ద జాతీయ ఉద్యానవనం. ఖాట్మండుకు ఉత్తరాన 32 కిలోమీటర్ల దూరంలో, టిబెట్ కోమోలాంగ్మా నేషనల్ నేచర్ ప్రిజర్వ్ సరిహద్దులో ఉంది. లాంగ్టాంగ్ నేషనల్ పార్క్ ఉద్యానవనంలో గోసాయికుండ పేరుతో ఒక సరస్సు ఉంది. దీన్ని చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. పచ్చని పొలాలు, అందాల తోటలు, అనేక రకాల వన్యప్రాణులు, 250 కంటే ఎక్కువ పక్షులను ఇక్కడ తిలకించవచ్చు.



## ఫుల్ చౌకీ

ఫుల్ చౌకీ పర్వత శ్రేణి ఖాట్మండులోయ చుట్టూ ఉంది. సాహిత్యపరమైన అర్థంలో దీని పేరు 'పువ్వులు' అని అర్థం. ఇక్కడ అందమైన పువ్వులు పెరుగుతాయి. ఇవి చాలా ప్రకాశవంతమైన రంగుల్లో ఉంటాయి. ఈ ప్రాంతం సందర్శించడానికి నాలుగు గంటల సమయం పడుతుంది.

## ఆకాశ భైరవ దేవాలయం

ఆకాశ భైరవ్ అంటే 'ఆకాశానికి ప్రభువు' అని అర్థం. ఖాట్మండు దర్బార్ స్క్వేర్ నుండి కేవలం ఐదు నిమిషాల నడక మార్గం ద్వారా ఈ ఆలయానికి చేరుకోవచ్చు.

ఈ ఆలయాన్ని ఆకాశ భైరవుడికి అంకితం చేశారు. నేపాల్ ప్రజలు ఎంతో విశ్వాసంతో ఈ దేవుని కొలుస్తారు. ఏడాదికి ఒకసారి 'ఇంద్ర జాత్ర' పేరుతో ఇక్కడ ఎనిమిది రోజుల పాటు గొప్ప ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి నేపాల్ నలుమూలల నుండి భక్తజనులు ఇక్కడకు వస్తుంటారు.





## వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

### మేషం



భాగస్వామ్య వ్యాపారులకు సమస్యలు పరిష్కారమవుతాయి. రుణాలు లభిస్తాయి. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. కుటుంబ పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి ప్రతికూలతలు ఉంటాయి.

### వృషభం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. సమస్యలు తీరి మానసిక ఊరట లభిస్తుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వృథా ఖర్చులను నియంత్రిస్తారు. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. ముఖ్యమైన పనులు ఆలస్యంగా పూర్తి చేస్తారు. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశాలున్నాయి. చర్చలు వాయిదా.

### మిథునం



వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. శుభ కార్యాలకు అనుకూలం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆరోగ్య సమస్యలు తీరి ఊరట లభిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య సుహృద్భావం ఏర్పడుతుంది. ఉద్యోగులకు పదోన్నతి సూచనలున్నాయి. విద్యార్థులకు విజయం. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ఎదురు చూస్తున్న సమాచారం తెలుస్తుంది.

### కర్కాటకం



వ్యాపారులకు లాభదాయకం. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు మానసిక ఒత్తిడి ఉంటుంది. ప్రముఖులను సందర్శిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సొంతింటి స్వప్నం సాకారమయ్యే సూచనలు అధికం. వారాంతంలో రుణాలు చేయాల్సి వస్తుంది.

### సింహం



వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. చిరు వ్యాపారులకు పోటీ వున్నా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. ఉద్యోగాభివృద్ధి ఆశాజనకంగా ఉంటుంది. ఓర్పుతో ప్రవర్తించడం మంచిది.

### కన్య



ప్రయాణం లాభిస్తుంది. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారులకు పోటీ ఎక్కువగా ఉంటుంది. అనుకోని వార్తలు వింటారు. వృథా కాలక్షేపం చేస్తారు. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. దూర దేశ ప్రయాణ సూచనలున్నాయి. ఆరోగ్య సమస్యలుంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఉద్యోగం లభిస్తుంది.

### తుల



ముఖ్యమైన పనుల్లో ప్రతికూలతలుంటాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. మొండి బకాయిలు వసూలవుతాయి. వారాంతంలో ఉత్సాహంగా గడుస్తుంది. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. శత్రువులపై విజయం సాధిస్తారు. విద్యార్థులకు పరీక్షల్లో విజయం లభిస్తుంది. సమయస్ఫూర్తితో అన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఎదురు చూస్తున్న శుభ వర్తమానం అందుకుంటారు.

### వృశ్చికం



ఆరోగ్య, ఆహార సలహాలు-సూచనలు తూచా తప్పకుండా పాటించండి. స్త్రీల వలన సమస్యలు వచ్చే సూచనలున్నాయి. చోర భయం పొంచి వుంది, అప్రమత్తంగా ఉండండి. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశాలున్నాయి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. క్రయ-విక్రయాలు యథాతథం.

### ధనుస్సు



కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. భాగస్వామ్య వ్యాపారులకు బాగుంటుంది. అనుకోని వార్తలు వింటారు. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. వ్యాపారులకు పోటీ పెరుగుతుంది. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటారు. వాక్చాతుర్యంతో అన్ని పనులు చక్కబెట్టుకుంటారు. సొంతింటి కల నెరవేరే సూచనలున్నాయి. మిత్రులను కలుసుకుంటారు.

### మకరం



సామాన్యంగా ఉంటుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రుణాలు చేతికందివస్తాయి. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. భాగస్వామ్య వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. సాహస నిర్ణయాలు తీసుకుంటారు. కళాకారులు, క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. శుభ వార్తలు వింటారు.

### కుంభం



ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. స్త్రీలకు శుభ యోగం. ఉన్నతాధికారులను సందర్శిస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఉద్యోగులు అదనపు బాధ్యతలు ఎక్కువవుతాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది.

### మీనం



కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలుంటాయి. పాత బాకీలు తీరుస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. బ్యాంకు రుణాలు మంజూరు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు పై అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. వివాదాలకు దూరంగా ఉండండి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు

# హాస్య కవిత

మా ఆవిడ పుట్టింది
సాయంత్రపు వెన్నెల వెలుగుల్లో
నేను పుట్టింది
మండే ఎండల్లో.
మా ఆవిడ పేరు రవళి
నా పేరు మురళి.
మేం ప్రేమించుకున్నాం
నాగావళి నదీ తీరాన.
మా ఆవిడకు ఇష్టం పిల్లి
దాని ముద్దుపేరు లిల్లి.
నా స్నేహితులు నల్లి, బల్లి
మా ఆవిడకు నేను జడ అల్లి
రోజూ సిగలో తురుముతాను మల్లెలు
మా ఆవిడ జడ అందాన్ని
చూడాలి మళ్లీ మళ్లీ
మా ఆవిడ హృదయం
విశాలమైన చల్లని
హిమాలయ పర్వతం
మా ఇద్దరి జీవితం
సంతోషాల నవ్వుల సాగరం.

– సంపంగివారి జయచంద్రారెడ్డి, బాపట్ల

# జోక్స్

## కళ్లజోడెందుకు?

భిక్షగాడు: ఏంటమ్మగారూ! కళ్లద్దాలు ఇచ్చారు?

ఇల్లాలు: నీవేగా కళ్లు కనిపించడం లేదు, ధర్మం చెయ్యండి అన్నావుగా. అందుకే కళ్లజోడు ఇచ్చాను.. అంది తెలివిగా.

భిక్షగాడు ఆ.. అని నోరెళ్లబెట్టాడు.

## ఎందుకు?

"ఒరేయ్ చింటూ! ఎవరినైనా సన్మానించేటప్పుడు శాలువా కప్పి సన్మానిస్తారెందుకు?" సందేహంగా అడిగాడు శివ, తన స్నేహితుడిని.

"చలికాలంలో చక్కగా ఉపయోగపడతాయని" అన్నాడు చింటూ.

## క్లాస్ బుక్స్ చదవాల్సింది?

"డియర్! నిన్న నీవు ఫోన్ చేయలేదుగా! అందుకే రాత్రంతా నిద్ర పట్టలేదు తెలుసా?" అంది గర్ల్‌ఫ్రెండ్.

"ఔనా! అయితే క్లాస్ బుక్స్ తీసి చదవాల్సింది" అని పంచ్ ఇచ్చాడు బాయ్ ఫ్రెండ్.

గర్ల్‌ఫ్రెండ్‌కు నోట మాట రాలేదు.

# ప్యారడీ పాట

"మరపురాని మనిషి" చిత్రంలోని "ఎక్కడో లేడులే దేవుడు" పాటకు ప్యారడీ.

పల్లవి:
ఎక్కడో లేదులే సెల్‌ఫోన్
మనమెక్కడుంటే అక్కడే ఉంటుంది
అరచేతిలో కాపురముంటుంది
ఆల్వేస్ ఆన్‌లోనే ఉంటుంది ॥ఎక్కడో॥

చరణం:
నెలలు నిండిన పసిపాప ఏడ్పును
తన మ్యూజిక్‌తో మురిపించును
పసిపాప బొమ్మల్లో మునుగును
చుట్టూ వున్న లోకాన్నే మరిపించును॥ఎక్కడో॥

చరణం:
మంచి చెడ్డలుండును సెల్‌ఫోన్‌లో
మంచి చూడాలి మనమంతా
నువ్వు నేర్వాలి సెల్లుతో మంచిని
పది మందికి పంచాలి ఆ మంచిని ॥ఎక్కడో॥

చరణం:
నీటిని పాలను వేరు చేయు హంసలు
పాలనే స్వీకరిస్తాయి హంసలు
నేటి బాలలవ్వాలి హంసల్లాగా
చెడునొదిలి మంచినే పట్టుకోవాలి ॥ఎక్కడో॥



– చాడా మునిశేఖర రెడ్డి, ప్రొద్దుటూరు

# నవ్వుల్... పువ్వుల్...

## ఆత్మరక్షణ కోసం..

"చలికాలంలోనూ గొడుగు ఎందుకు తీసుకెళ్తున్నావు?" అడిగాడు భాస్కర్ తన మిత్రుడు శంకర్‌ని.

"నా మీద ఎవరైనా దాడి చేస్తే ఆత్మరక్షణ కోసం తిప్పికొట్టాలని" బదులిచ్చాడు శంకర్.

## వృత్తిధర్మం!

"ఒరేయ్ చంటీ! ఆ అమ్మాయిని ఏమైనా అన్నావా? పళ్లూడగొడతాను అంటోంది"



అడిగింది బామ్మ, మనవడిని.

"అబ్బే అదేంలేదు బామ్మా! ఆ అమ్మాయి డెంటిస్ట్.. అంటే పళ్ల డాక్టర్. పళ్లు పీకటం ఆమె వృత్తి" అన్నాడు మనవడు తెలివిగా.

## నిలబెట్టొద్దన్నారుగా!

భార్య: ఏమైందండీ? మన బైక్‌ను పడుకోబెడుతున్నారెందుకు?

భర్త: ఇక్కడ వాహనాలు నిలుపరాదు అని బోర్డు పెట్టారుగా.. అందుకే అన్నాడు వెర్రి వెంగళప్ప.

- దండెం రాజయ్య, దోర్నకల్

## వంట రాదు..

"మా కూతురుకైతే వంట రాదు" అని కుండబద్దలు కొట్టింది పెళ్లికూతురు తల్లి.

"పర్వాలేదు, నాకు వంట చేయడం వచ్చు, మీ కూతురు తినగలిగితే చాలు" అంటూ చెప్పాడు వయసు ముదిరిన పెళ్లికాని ప్రసాద్.

- కె.లహరి, కరీంనగర్

# మంచి చేస్తే ఆ ఫలాన్ని చూస్తాం

నేనో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని. నన్ను ట్రాన్స్‌ఫర్ మీద వేరే ఊరికి పంపడానికి ప్రభుత్వం నిశ్చయించింది. తప్పదు కదా, ఉద్యోగ ధర్మం అది. గుడ్డిలో మెల్లగా నన్ను ఇరవై కి.మీ. దూరంలో ఉన్న సుంకేశుల పాఠశాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. పేరుకు అది సుంకేశుల పాఠశాల అయినా అది గ్రామానికి ఒకటిన్నర కి.మీ. దూరంలో ఊరి బయట ఉంటుంది.

ప్రతి దినం ముగ్గురు టీచర్లం బస్సులోనో లేదా మా టూ వీలర్ల మీదనో మా ఊళ్ల నుండి సుంకేశుల వెళ్లి ఉద్యోగం చెయ్యాలి.

రెండు రోజుల తరువాత నాకు అర్థం అయిందేమిటంటే స్కూల్లో పిల్లలు చాలా బీదవారు. చాలా మంది వ్యవసాయ కూలీల పిల్లలే! వారి బట్టల్లో శుభ్రత కనబడేది కాదు. కాళ్లు మురికి కొట్టుకుని ఉండేవి.

చదువు కంటే ముఖ్యంగా వారికి శుభ్రత గురించి బోధించి వారిలో మార్పు తీసుకురావాలనుకున్నాను.

మెల్లగా వారికి శుభ్రత, దాని అవసరం బోధించసాగాను. చాలామంది పిల్లలు నా బోధనను అర్థం చేసుకున్నారు. రెండు రోజుల్లోనే వారిలో మార్పు గమనించాను. చాలామంది శుభ్రమైన బట్టలు ధరించడం గమనించాను. కానీ చాలా మందికి కాళ్లు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. దానికి కారణం ఆ చిన్న పిల్లలు సుంకేశుల ఊరి నుండి స్కూల్‌కు నడిచి వస్తున్నారు. ఊరినుండి స్కూల్‌కి మంచి రోడ్డు లేదు. కేవలం మట్టిరోడ్డే. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ప్రభుత్వాలు కొన్ని పల్లెల రోడ్ల మీద దృష్టి ఎందుకు పెట్టవో నాకు అర్థంకాని విషయం. నడిచి స్కూల్‌కి వచ్చే పిల్లలకు ఏ విధంగా సహాయం చెయ్యాలా? అని ఒక రాత్రి తీవ్రంగా ఆలోచించాను. అలా ఆలోచించగా.. ఆలోచించగా నా బుర్రలో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది.

పొద్దున్న స్కూల్‌లో నా తోటి ఇద్దరు టీచర్లతో నా మెరుపు ఆలోచనను గురించి చర్చించాను. దానికి వారు కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేసి, తమ సహకారం కూడా ఉంటుందని చెప్పారు. మా ఊరిలో మూడు అపార్టుమెంట్లు ఉన్నాయి. ఒక అపార్టుమెంటులో వాడకుండా పెట్టేసిన పాత సైకిళ్లను కొద్ది నెలల కిందట గమనించాను. అందుకని ఆ అపార్టుమెంటుకి వెళ్లి అక్కడి వాచ్‌మన్‌ను వాటి గురించి అడిగాను.

"వాటిని వాడిన పిల్లలు పెద్దవాళ్లయ్యారు బాబూ, వాళ్లు మోటారుసైకిళ్లు కొనుక్కున్నారు" చిరునవ్వుతో చెప్పాడు.

"మరి అవి అమ్ముతారా?" ఆశతో అడిగాను.

"కొంచెంసేపు ఉండండి బాబూ, సెక్రటరీ గారు వస్తారు.. ఆయనను అడగండి" చెప్పాడు, వాచ్‌మన్.

కొద్దిసేపట్లోనే కారులో వచ్చాడు అపార్ట్‌మెంట్ సెక్రటరీ.

వాచ్‌మన్ నన్ను పరిచయం చేసి నా కోరికను ఆయనకు విన్నవించాడు. ఆయన నన్ను విచిత్రంగా చూసి "మీరు ఏం చేస్తుంటారు?" అడిగాడు.

"సార్! నేను సుంకేశుల ఎలిమెంటరీ స్కూల్ టీచర్ని. అక్కడ అంతా బీద పిల్లలు. వాళ్లు సుమారు ఒకటిన్నర కిలోమీటరు నడచి స్కూల్‌కి వస్తుంటారు. స్కూల్‌కి వచ్చేసరికి వాళ్ల కాళ్లు మట్టి కొట్టుకుపోయి ఉంటాయి. వాళ్లకి సైకిల్ కొనేంత స్థోమత లేదు. అందుకని నేను ఇద్దరు కొలీగ్స్ కొన్ని సైకిళ్లు కొని, ఆ బీద పిల్లలకు ఇద్దామని అనుకుంటున్నాం. మీకు సమ్మతమైతే ఆ సైకిళ్ల ఒనర్లని అడిగి కొంటాం" చెప్పాను.

> 'కొంచెంసేపు ఉండండి బాబూ, సెక్రటరీ గారు వస్తారు.. ఆయనను అడగండి" అని చెప్పాడు వాచ్‌మన్. కొద్దిసేపట్లోనే కారులో వచ్చాడు అపార్ట్‌మెంట్ సెక్రటరీ.

నా మాటలు ఆ సెక్రటరీ శ్రద్ధగా విన్నాడు. కొంత నిశ్శబ్దం తరువాత ఆయన "ఒక మంచి పని చేస్తుంటే మేం ఎందుకు కాదంటాం? ఆదివారం నేనే ఒక చిన్న మీటింగ్ పెట్టి అపార్టుమెంటువాసులకి మీరు చేయబోయే మంచి పనిని గురించి చెబుతాను. మా వంతు సహాయం మేం చేస్తాం" అని చెప్పాడు.

ఆయన చెప్పిన మాటలకు నా హృదయం పులకించింది" సరేనని చెప్పి వెళ్లాను. ఆదివారం నేను నా ఇద్దరు కొలీగ్స్ ఆ అపార్టుమెంటుకు వెళ్లాం. అనుకున్నట్టుగానే సెక్రటరీ అపార్ట్‌మెంట్‌వాసులకి మమ్మల్ని చూపించి, మా ఆలోచనను వారికి చెప్పారు. అది విని వారు చప్పట్లు కొట్టారు.

వారిలో ఓ పెద్దాయన లేచి "తప్పకుండా ఆ సైకిళ్లు తీసుకోండి, కానీ డబ్బులకు కాదు.. ఫ్రీగా. ఎందుకంటే ఒక సంవత్సరం నుండి వాటిని ఎవరూ ఉపయోగించడం లేదు. వాటిని మీరు ఒక మంచి పనికి ఉపయోగిస్తే అంతకంటే ఏం కావాలి. ఇక్కడ మాకు స్పేస్ కూడా కలిసి వస్తుంది, ఏమంటారు?" అని అందరి వైపు తిరిగి అడిగారు.

ముక్తకంఠంతో అందరూ "ఓకే" అన్నారు.

మరొక పెద్దమనిషి లేచి "అక్కడ ఉన్న పది సైకిళ్లే కాదు, నేను వేరే అపార్టుమెంటుకి ఓనర్ని. అందులో కొన్ని సైకిళ్లు ఉన్నాయి. అవి కూడా ఇస్తాం. అవసరం ఉన్నవారికి ఉపయోగించండి. అదీగాక అన్ని సైకిళ్లను నా లారీలో మీ సుంకేశులకు పంపిస్తాను" అని గొప్ప మనసుతో చెప్పాడు.

ఆశ్చర్యపోవడం నా వంతైంది. నేను, నా కొలీగ్స్ అందరికీ థాంక్స్ చెప్పి "సార్! ఎల్లుండి సైకిళ్లను సుంకేశులకు పంపండి. మేం రిసీవ్ చేసుకుంటాం. మీలో కొంతమంది అయినా సుంకేశుల వచ్చి ఆ పిల్లల తల్లిదండ్రులకి సైకిళ్లు ఇస్తున్నట్లు చెప్పండి, వారు కూడా ఎంతో సంతోషిస్తారు" అని వారిని స్కూల్‌కి ఆహ్వానించాం.


"తప్పకుండా వస్తాం, ఓ మంచి పనిలో భాగస్వాములైనందుకు మాకు కూడా సంతోషం" అని చెప్పారు.


వారి మాటలు మాలో సంతోషాన్ని నింపాయి. మేం ఓ సంవత్సరం తరువాత గమనించిందేమిటంటే ఆ సైకిళ్లు క్రమం తప్పకుండా వారు వాడుతుండటం వల్ల వారు ఆరోగ్యంగా, హుషారుగా కనబడసాగారు.


మనం మంచి తలపెడితే తప్పక మార్గం కనబడుతుంది. దాని ఫలాలు తప్పక మనం చూస్తాం కదా!

**- కంచనపల్లి వేంకట కృష్ణారావు**

# ఈ వారం కా'ర్టూన్స్'


ఆటాచ్డ్ బాత్రూం కట్టుకుందాం...!
జనాల నెత్తి మీద వేయడం బాలేదు...!!
Zakir...


పిదాండబు క్రిప్టో కాయిన్స్‌లో పెట్టావనుకో... జీవితాంతం
నెలకు కోటి సంపాదించొచ్చు... అప్పుడు హాయిగా విదేశాలకు
వెళ్లి కూడా అడుక్కోవచ్చు...!!!
క్రిప్టో
ఏజెంట్


ఇంద.. ఇది తీసుకొని
తోక ఊపు...!!
Zakir...



విమాన ఆకారంలో వున్న విలాసవంతమైన ఈ హోటల్ టర్కీలో ఉంది. ప్రపంచంలో ఇలాంటి హోటల్ ఇదొక్కటేనట. అంతాల్యా నగరానికి దగ్గరలో సముద్ర తీరంలో వున్న ఈ హోటల్ టర్కీలోని పర్యాటక ప్రాంతాల్లో ఒకటి.







